
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 11.12.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 5



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# జగన్ బలహీనతే...
# బాబు బలం!



- అవకాశాలను అందుకోలేకపోతున్న ప్రతిపక్షనేత!
- అధికారమే లక్ష్యంగా అర్థంపర్థం లేని హామీలు
- కొత్త సమీకరణలపై ముందుచూపేది?

***ఇంగ్లండ్, న్యూజిలాండ్‌ల మధ్య వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ జట్టు 125పరుగులకే ఆలౌట్ అయ్యిందనుకుందాం. ఈ స్కోర్ మీద గెలవడం న్యూజిలాండ్‌కు ఈజీ అనుకుంటాం. కానీ, బ్యాటింగ్ మొదలు పెట్టిన న్యూజిలాండ్ జట్టు 75పరుగులకే కుప్పకూలిపోతే... ఇంగ్లండ్ విజేత అవుతుంది. అయితే ఇక్కడ ఇంగ్లండ్‌ను గెలిపించింది వారి బలం అనుకోవాల్సిన పనిలేదు. 125పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కూడా తాకలేని న్యూజిలాండ్ బలహీనత అనుకోవాలి.***

రాజకీయాల్లోనూ ఈ బలహీనతలు సాధారణంగా వుంటాయి. ప్రభుత్వం సమర్ధవంతంగా పని చేస్తున్నప్పుడు ఎంతటి పటిష్టమైన ప్రతిపక్షాన్నైనా ఎదుర్కోగలదు. కానీ, బలహీనమైన ప్రతిపక్షం వున్నప్పుడు ఎంత చెత్త ప్రభుత్వమైనా తన పైచేయి నిరూపించుకోగలదు. ప్రస్తుతం రాష్ట్రంలో అదే జరుగుతోంది. చంద్రబాబు ప్రభుత్వం అత్యంత చెత్తగా వుంది. ఈ ప్రభుత్వ విధానాలు ప్రజలకు ఏ మాత్రం పడడం లేదు. ఏ జిల్లాలోనూ అభివృద్ధి పనులు జరగడం లేదు. తెలుగుదేశం నాయకులు అందినకాడికి దోచుకుంటున్నారు. ఇసుకలో అక్రమాలు, ఇరిగేషన్ పనుల్లో అవినీతి పరవళ్లు, మద్యం మాఫియా, ఇసుక మాఫియా, భూమాఫియా... ఇచ్చిన హామీలకు దిక్కు లేదు. రాజధాని పేరుతో, ఇతర సెజ్‌ల పేరుతో భూములు లాక్కుంటూ రైతులను రోడ్ల మీదకు విసిరేస్తున్నారు. దోపిడీయే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమన్నట్లుగా పరిపాలన సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి వుండుంటే సీఎం చంద్రబాబుకు చుక్కలు చూపించుండేవాడు. కానీ, చంద్రబాబు అదృష్టంకొద్ది ఈరోజు ఆయన లేడు. జగన్ ప్రతిపక్ష నేత కావడం చంద్రబాబుకు కలిసొస్తోంది. ఈ తెలుగుదేశం ప్రభుత్వమే బలహీనంగా వుందనుకుంటే, ప్రతిపక్షం అంతకంటే బలహీనంగా వుంది. చంద్రబాబు అనుభవంతో తన పార్టీని

(మిగతా 11వ పేజీలో)

- జిల్లాలో కేంద్ర బృందం సుడిగాలి పర్యటన


## వచ్చారు... చూశారు... వెళ్లారు!



12లో

## న్యూరో సైన్స్‌కు మరియు వెన్నుముక రుగ్మతలకు భవిషత్ దిశ - గ్లోబల్ హెల్త్ సిటి

GLOBAL™
HEALTH CITY
more to life



న్యూరో సైన్స్ మరియు నాడీ వ్యవస్థలకు సంబంధించిన శస్త్ర చికిత్సలలో అత్యంత గౌరవనీయమైన స్థానంలో నిలిచింది మన గ్లోబల్ హెల్త్ సిటీ. అంతే కాక మెదడుకు సంబంధించి లోపాలు మరియు మెదడుకు యొక్క పునర్నిర్మాణం నందు వేగవంతమైన సాంకేతిక నమూనాలను మన దేశంలో మొట్టమొదటి సారిగా ఉపయోగించి చూపించారు. వైద్యరంగంలో పేరుగాంచిన అనుభవజ్ఞులైన డాక్టర్ల నిర్వహణలో అతి క్లిష్టమైన మెదడు మరియు వెన్నెముక సమస్యలకు చికిత్సను అందించుటలో దేశంలోనే అత్యుత్తమ స్థానంలో నిలిచింది గ్లోబల్ హెల్త్ సిటీ.

భారతదేశంలో మెదడు మరియు వెన్నెముక సమస్యలకు సంబంధించిన న్యూరో ఇంటర్వెన్షనల్ విధానాన్ని (శస్త్ర చికిత్స లేని ప్రక్రియ) చాలా తక్కువ కేంద్రాలలో మాత్రమే ప్రదర్శించగలిగారు. ఈ నూతన విధానాన్ని విజయవంతంగా ప్రదర్శించుటలో ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో ప్రశంశలు అందుకున్న ఏకైక హాస్పటల్‌గా నిలిచింది గ్లోబల్ హెల్త్ సిటీ.

దక్షిణ భారత దేశంలోనే చెన్నై నగరంలో 250 బెడ్‌లతో 20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ప్రపంచ అత్యుత్తమ శ్రేణి సంరక్షణ హాస్పిటల్ గా పేరుపొందింది. భారతదేశంలోనే అతి పెద్ద అవయవాల మార్పిడి మరియు చికిత్స కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు సాధించింది. అంతేకాక మెదడుకు సంబంధించిన చికిత్సా కేంద్రాలలో ఉత్తమ కేంద్రంగా నిలిచింది గ్లోబల్ హెల్త్ సిటీ.

### గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్స్ & స్పైనల్ డిసార్డర్స్

### వైద్య సదుపాయాలు:

**న్యూరాలజీ :**
తలనొప్పి, స్ట్రోక్, మూర్ఛ, పార్కిన్‌సన్స్ డిసీస్, పెరిఫెరల్ నరాల వ్యాధి, డెమెంటియా, చిత్తవైకల్యం, కండరాల బలహీనత, మానసిక రుగ్మతల

**న్యూరో ఇంటర్వెన్షన్: ( శస్త్ర చికిత్స లేని విధానం)**
స్ట్రోక్, ఎన్యూరిసమ్స్, ధమనుల మరియు సిరల వైకల్యాలు

**న్యూరోసర్జరీ:**
బ్రైన్ ట్యూమర్స్ కి మరియు న్యూరో ఎండోస్కోపీ లకు మైక్రో సర్జరీ, కోర్టికల్ మ్యాపింగ్ మరియు మూర్ఛకు సర్జరీ, ఎన్యూరిజం కాయిలింగ్, ధమనులకు సంబంధించి స్టెంటింగ్ మరియు థ్రోంబోసిస్, మెదడు రుగ్మతలు.

**వెన్నెముక మరియు వెన్ను ఎముక:**
కీ హోల్ డిస్క్ సర్జరీ, వెన్నెముక ఆర్థోప్లాస్టీ, కృత్రిమంగా డిస్క్ భర్తీచేయుట, వెన్నెముక సంబంధించి సర్దుబాట్లు చేయుట (స్కొలియోసిస్, కైఫోసిస్)

**వెన్నెముక మరియు ఎమర్జెన్సీ మరియు వెన్నెముక సంబంధించి ఇంటెన్సివ్ కేర్:**
రాష్ట్రంలోనే ఏకైక న్యూరో ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU) , తలగాయాలు, వెన్నెముక గాయాలకు ఆధునిక చికిత్సా రీసెర్చ్ సంస్థ.

**నాడీ మనోరోగము మరియు నాడీ పునరావాసము:**
తల గాయాలకు సంబంధించి నాడీ పునర్నిర్మాణం, వెన్నెముక సంబంధిత లోపాలు మరియు వెన్నెముక ప్రమాదాలు

www.globalhospitalsindia.com

గ్లోబల్ హెల్త్‌సిటీ, 439 చెరన్‌నగర్, పెరుంబాకం, షోలింగ నల్లూరు, చెన్నై - 100
Ph: +91 - 44 - 4477 7000, Email: infochennai@globalhospitalsinfa.com

గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్, నెం. 16-2-230, క్రైజన్ హైట్స్, సండేమార్కెట్, పొగతోట, నెల్లూరు -1.
ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్: 9989777101,7680931555, 8978788116, 8978788115

24/7 UDANAE GLOBAL Emergency Care
✆044-4624 2424

# ఆలయాల అభివృద్ధికి టిటిడి ప్రాధాన్యత

**- చైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి**

ఆలయాల అభివృద్ధికి టిటిడి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానాల చైర్మెన్ చదలవాడ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన నాయుడుపేటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మన దేశ సంస్కృతి సంప్రదాయాలు వేదాల ఆధారంగా వచ్చాయని, వాటిని మనం పరిరక్షించుకోవాలని అన్నారు. ప్రజల్లో ధర్మచింతనను, ఆధ్యాత్మిక భావనను మరింతగా పెంపొందించేందుకు టిటిడి ఎంతో కృషి చేస్తోందన్నారు. శిథిలావస్థలో వున్న ఆలయాలను బాగుచేసి తిరిగి వాటికి పూర్వవైభవాన్ని సంతరించిపెట్టాలనే ధ్యేయంతో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో, పలుచోట్ల శిథిలావస్థలో వున్న వెంకటేశ్వరస్వామి ఆలయాలను బాగుచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. తుమ్మూరులో కరిమాణిక్యస్వామి ఆలయం, ఈ ఆలయానికి అనుబంధంగా వున్న నీలకంఠేశ్వరస్వామి ఆలయాన్ని టిటిడి పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా నాయుడుపేట అగ్రహారపేటలో వున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, తుమ్మూరు వద్ద అసంపూర్తిగా వున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం, గూడూరులోని పలు ఆలయాలను అన్నిటినీ స్థానిక భక్తుల విజ్ఞప్తి మేరకు టిటిడి పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. పెంచలకోన, మల్లాంలో కల్యాణమండపాలు, సూళ్ళూరుపేట వద్ద మన్నారుపోలూరులో వున్న అలఘనాధస్వామి ఆలయంతో పాటు, జిల్లాలో ప్రాధాన్యం వున్న ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కూడా తగు పరిశీలనలు చేస్తున్నామన్నారు. కలియుగ దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని సామాన్య ప్రజలందరూ దర్శించుకునేందుకు టిటిడి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి స్వామివారి దర్శనం, ఉచిత వసతి గదులు, అన్న ప్రసాదాలు అన్నీ పూర్తిస్థాయిలో కల్పించేందుకు టిటిడి నిర్విరామ కృషి చేస్తుందన్నారు. వైకుంఠ ఏకాదశి రోజున శ్రీవారి దర్శనభాగ్యాన్ని సామాన్య భక్తులకు అందుబాటులో వుండే విధంగా విఐపి టిక్కెట్లను రద్దు చేయడం జరిగిందని, ఎలాంటి సిఫారసు లేఖలు వచ్చినా వైకుంఠ ఏకాదశిన స్వామివారి దర్శనానికి ప్రత్యేక టిక్కెట్లు ఇచ్చేది లేదన్నారు. ఈ సమావేశంలో నాయుడుపేట నగర పంచాయతీ వైస్‌చైర్మెన్ ఎ.సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు హనుమంతరావు, కె. రాజారెడ్డి, చంద్రశేఖర్, రత్నయ్యతో పాటు చదలవాడ అభిమానులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ ఎస్ఐ కేసుపై ఎస్పీ సీరియస్

ఇందుకూరుపేటలో ఎక్సైజ్ ఎస్ఐపై జరిగిన దాడి సంఘటన కేసును జిల్లా ఎస్పీ గజరావ్‌భూపాల్ సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ ఎస్ఐ ఆసిఫ్‌బేగ్ తనపై జరిగిన దాడి గురించి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు పెట్టకుండా, నమోదు చేయకుండా నానబెట్టిన విధానం ఎస్పీకి ఆగ్రహం కలిగించింది. ఇటీవల ఇందుకూరుపేట మండలం పున్నూరులోని ఓ బెల్టు దుకాణంపై ఎక్సైజ్ ఎస్సై దాడి చేశారు. దీనికి ఆగ్రహించిన స్థానిక మద్యం వ్యాపారులు ఎక్సైజ్ సిఐ కార్యాలయంలోనే సిఐ ఎదుటే ఆసిఫ్ బేగ్‌పై దాడికి పాల్పడ్డారు. దీనిపై ఆసిఫ్‌బేగ్ ఇందుకూరుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే నెలవారీ మామూళ్ళతో ఎక్సైజ్ శాఖనే శాసిస్తున్న మద్యం వ్యాపారులు ఈ సంఘటనపై నెల్లూరులోని డిసి కార్యాలయంలో పంచాయితీ పెట్టారు. ఎస్సైను పిలిపించి నిందితుల చేత సారీ చెప్పిస్తామని రాజీకి ఒప్పించారు. ఈ కేసు రాజీ అవుతుందని నమోదు చేయవద్దని పోలీసులకు చెప్పడంతో ఇందుకూరుపేట ఎస్సై కోటిరెడ్డి కూడా కేసు నమోదు చేయలేదు. అయితే ఈ రాజీ వార్త మీడియాలో రావడంతో గుట్టురట్టైంది. ఎస్పీ గజరావ్ భూపాల్ ఇందుకూరుపేట పోలీసుస్టేషన్‌కు వచ్చి ఈ కేసు విషయమై సిబ్బందిని తీవ్రంగా మందలించినట్లు తెలుస్తోంది.

# విజిలెన్స్ డిఎస్పీ తనిఖీలు

విజిలెన్స్ ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పీ పి.వెంకటనాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం నెల్లూరు జిల్లా తడ మండలం బివిపాళెంలోని చెక్‌పోస్ట్‌లో తనిఖీలు చేపట్టారు. శనివారం రాత్రి స్వర్ణ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించిన డిఎస్పీ చెక్‌పోస్టు మీదుగా రవాణా సాగిస్తూ తనిఖీలు చేసుకోకుండా వెళుతున్న ఏడు వాహనాలను గుర్తించి పట్టుకున్నారు. ఈ విషయాన్ని డ్యూటీలో వున్న ఏసీటీఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 243వాహనాలకు సంబంధించిన వివరాలను క్రాస్‌చెక్ చేశారు. డిఎస్పీ వెంట సిఐ శ్రీనివాసరావు, ఎఫ్‌ఆర్ఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఓ ధనుంజయ్‌రెడ్డి, రాము, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

# ఈ-పాస్ పద్ధతిలో బియ్యం

ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం నెల్లూరుజిల్లాలోని 17ఐసిడిఎస్ ప్రాజెక్టులలో పని చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు సంబంధిత రేషన్‌షాపుల ద్వారా ఆ కేంద్రానికి కేటాయించిన బియ్యాన్ని ఈ-పాస్ పద్ధతిలో తీసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.విద్యావతి తెలిపారు. జిల్లాలో గూడూరు రూరల్, గూడూరు అర్బన్, ఇందుకూరుపేట, కోట, నాయుడుపేట, రాపూరు, సూళ్లూరుపేట, ఉదయగిరి, వింజమూరు మండలాలకు సంబంధించిన ప్రాజెక్టులలో వారు మాత్రమే పామాయిల్‌ను ఈ పాస్ విధానం ద్వారా తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆమె తెలియజేశారు.

# భూ సమస్యలను పరిష్కరించండి

**జిల్లా కలెక్టర్‌కు గౌతమ్‌రెడ్డి విజ్ఞప్తి**

ఆత్మకూరు నియోజకవర్గంలోని ఏఎస్‌పేటలో గిరిజనులకు పంపిణీ చేసిన భూములను వారికి కాకుండా ఇతరులు అనుభవిస్తున్నారని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే గౌతమ్‌రెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 5న ఆయన నెల్లూరులో జరిగిన జిల్లాపరిషత్ సమావేశానికి హాజరై, అనంతరం కలెక్టర్‌ను కలిసి ఆ మేరకు గిరిజనులకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సింహపురి సమాచారం

# నలుగురు ఏసిటిఓలకు బదిలీ

తడ మండలంలోని భీములవారి పాళెం ఉమ్మడి తనిఖీ కేంద్రంలో ఏడాది పూర్తిచేసుకున్న నలుగురు ఏసిటిఓలను బదిలీచేస్తూ ఈ నెల 5న ఉత్తర్వులు వచ్చాయి. కెవి కుమార్, కె.జంపయ్య, పి.అబ్రహ్మాలింకన్, ఏ.బాజిరెడ్డి బదిలీ అయినవారిలో వున్నారు. వీరి స్థానంలో గుంటూరుజిల్లా నుంచి పి.శరత్‌బాబు, బి.గోపాల్, ఎస్‌కె మక్బుల్‌బాషాలను నియమించారు.

## పారిశుద్ధ్యం పర్యవేక్షణకు

# ప్రత్యేక సిబ్బంది

జిల్లాలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించేందుకు 33 మంది సీనియర్ అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. వారంలో మూడురోజుల పాటు వారికి కేటాయించిన గ్రామాలు, మండలాల్లో పనులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదేవిధంగా, నెల్లూరు నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు జాయింట్ కలెక్టర్ ఏఎండి ఇంతియాజ్, తెలుగు గంగ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ పి.సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డిలను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

# జనచైతన్య యాత్ర

నెల్లూరు 17వ డివిజన్ పరిధిలోని ఆకుతోట హరిజనవాడలో ఆదివారం డివిజన్ అధ్యక్షులు పాశం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనచైతన్య యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారా లోకేష్ సేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు వంద దుప్పట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో పాముల రమణయ్య, పంట్రంగి వెంకటేశ్వర్లు, శీను పాల్గొన్నారు.

# సైనిక దళాల త్యాగాలు అపారం

**- కలెక్టర్ యం.జానకి**




భారత దేశ సరిహద్దుల్లో దేశ రక్షణకై పోరాడిన అమరవీరులైన సైనిక దళాల సంక్షేమానికి ప్రతిఒక్కరూ భాగస్వాములై ఆదుకోవలసిన బాధ్యత అందరిపై వుందని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు కలెక్టర్ బంగ్లాలో సాయిధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో భాగంగా తొలుత జిల్లా కలెక్టర్ తమవంతు విరాళాన్ని అందించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీ సాయుధదళాల పతాక దినోత్సవం(ఫ్లాగ్‌డే)ను జరుపుకోవడం అభినందనీయమన్నారు. భారత సైనిక దళాలు వారి ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దేశ రక్షణకై పాటుపడుతూ వారి సాహసం, త్యాగాలను గుర్తుంచుకొని సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలను ఇచ్చి వారి సంక్షేమానికి పాటుపడాల్సిన అవసరం వుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, దాతల వ్యాపారస్తులు అందరూ విరాళాలు ఇచ్చి సైనికుల సంక్షేమ నిధికి సహాయసహకారాలందించాలన్నారు. ఈ నిధికి విరాళాలు ఇస్తే ఇన్‌కంటాక్స్ రాయితీ వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సిఇఓ సుబ్రహ్మణ్యం, కమాండర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జార్ఖండ్‌లో అరాచకం

# మావోయిస్టుల దాడిలో నెల్లూరు వాసి మృతి

జార్ఖండ్‌లో మావోయిస్టుల అరాచకాలకు అంతే వుండడంలేదు. పొట్టకూటి కోసం అక్కడికి వెళ్ళి పనులు చేస్తున్నవారిపై కూడా నిర్దాక్షిణ్యంగా దాడులుచేసి మట్టు బెడుతున్నారు. ఇటీవల నెల్లూరుజిల్లాలోని విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన పెనుబోలు వెంకురెడ్డిపై మావోయిస్టులు దాడిచేయగా, ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. వెంకురెడ్డిది వావిళ్ళ అయినా ఇటీవల నెల్లూరులో నివసిస్తున్నారని, ఓ నిర్మాణ సంస్థలో ఆయన పనిచేస్తుండగా, ఆ సంస్థ జార్ఖండ్ అడవుల్లో కాలువ తవ్వే పనులు కాంట్రాక్టుకు తీసుకుందని, ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న వెంకురెడ్డిని సంబంధిత కాంట్రాక్టర్ ఫోన్ నెంబరు కావాలని మావోయిస్టులు అడిగారని, ఆయన తనకు తెలియదని చెప్పడంతో అతనిని తీవ్రంగా కొట్టారని, ఆ దాడిలో వెంకురెడ్డి మృతి చెందాడని సమాచారం. ఆ తర్వాత అక్కడున్న ఇద్దరు కూలీలను కూడా తమవెంట తీసుకుపోయారని, తాము అడిగిన డబ్బు ఇస్తేనే కూలీలను వదిలిపెడతామని, లేకుంటే చంపేస్తామని మావోయిస్టులు బెదిరిస్తున్నట్లు సమాచారం. కాగా, మంత్రి నారాయణ ఓఎస్‌డి సి. హెచ్. పెంచలరెడ్డికి ఈయన దగ్గరి బంధువు కూడా.

# సరిలేరు... మాకెవ్వరూ...



మగువలను తలదన్నే విధంగా నృత్య ప్రదర్శనలు చేసి సరిలేరు మాకెవ్వరూ అంటూ అందరి ప్రశంసలు కరతాళధ్వనులు అందుకున్నారు హిజ్రాలు. నెల్లూరు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాల్‌లో రాష్ట్ర స్థాయి శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాల పాటల పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న కళాకారులు పోటీపోటీగా తమ ప్రతిభను కనపరిచారు. ప్రత్యేక నృత్య ప్రదర్శనల్లో హిజ్రాలు మయూరి, హేమ చేసిన నృత్యాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లా హిజ్రాల సంఘం అధ్యక్షురాలు అలేఖ్యను ముఖ్యఅతిథులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని హిజ్రాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు షీల్డు ప్రశంసాపత్రాలను ముఖ్యఅతిథులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా శాస్త్రీయ నృత్యంలో పి.రూపశ్రీ ప్రహర్షిత(కావలి), పి.కృష్ణవేణి (శ్రీకాళహస్తి), రోషిణి(నెల్లూరు) అందుకున్నారు. సోలో సినీ నృత్య పోటీల్లో ఎస్.కె.నాజియా (నెల్లూరు), విక్రాన్(నెల్లూరు), మయూర్‌కృష్ణ(నెల్లూరు) అందుకున్నారు. సినీ పాటల పోటీలలో కె.పూజిత(ముత్తుకూరు), పి.సాయికుమారి(నెల్లూరు), ప్రశాంతి(నెల్లూరు) అందుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవరాల సుబ్రహ్మణ్యం, బొల్లినేని శ్రీధర్, కార్పొరేటర్లు బొల్లినేని శ్రీవిద్య, అంచూరు జానకి, మండవ రామయ్య, నెల్లూరుకు చెందిన సినీనటి జగన్నాటకం ఫేం మీనప్రియ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు, మిమిక్రి ఆర్టిస్టు బీరంగుంట శ్రీనివాసులు పర్యవేక్షించారు.

### జిల్లా కాంగ్రెస్‌కు...

# అతడే ఒక సైన్యం



**డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, రేబాల దశరథరామిరెడ్డి, బెజవాడ రామచంద్రారెడ్డి, ఏసి సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ఆనం సంజీవరెడ్డి, ఆనం రామనారాయణ రెడ్డి... హేమాహేమీల వంటి ఇలాంటి నాయకులెందరో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని నడుపుకుంటూ వచ్చారు. కాంగ్రెస్‌పార్టీ అంటేనే రాటుదేలిన నాయకుల సమూహం అని లెఖ్ఖ. అలాంటి పార్టీని ఈరోజు నెల్లూరు జిల్లాలో నడిపిస్తున్నదెవరో తెలుసా? కొమ్ములు తిరిగిన నాయకులంతా వదిలిన జిల్లా కాంగ్రెస్‌కు ఈరోజు అండగా నిలుస్తున్న దెవరో తెలుసా? కాంగ్రెస్‌పార్టీతో గాని, రాజకీయాలతో గాని అసలు ఏ సంబంధం లేకుండా తన వ్యాపారాన్ని తాను చేసుకుంటూ హఠాత్తుగా రాజకీయాల్లోకి వూహించని విధంగా వచ్చిన కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అనే యువకుడు.**

నిజమే, ఈరోజు జిల్లాలో కాంగ్రెస్‌పార్టీకి అతనే దిక్కయ్యాడు. పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలన్నా, కార్యక్రమాలకు పది మంది మనుషులను తీసుకురావాలన్నా అతనే మార్గమయ్యాడు.

ఇన్వెంటివ్ యాడ్స్ వినోద్‌రెడ్డిగా నెల్లూరీయులకు సుపరిచితుడైన వినోద్‌కి 2009 ముందు దాకా రాజకీయాలతో గాని, కాంగ్రెస్‌పార్టీతో గాని ఎటువంటి సంబంధం లేదు. కాకపోతే అన్ని పార్టీల వారికి కూడా ఫ్లెక్సీలు అతనే డిజైన్ చేసేవాడు కాబట్టి అన్ని పార్టీల నాయకులతో సత్సంబంధాలుండేవి. ఈ సత్సంబంధాలు అప్పట్లో నెల్లూరురూరల్ ఎమ్మెల్యేగా వున్న ఆనం వివేకాతో కొంచెం జాస్తిగా పెరిగాయి. ఈ జాస్తి కావడమే వినోద్‌రెడ్డి పయనాన్ని మార్చింది. ఈరోజు జిల్లా కాంగ్రెస్‌లో అతనినొక ముఖ్యనాయకుడిగా చేసింది.

ఫ్లెక్సీ డిజైన్‌లను అందంగా తయారు చేయడంలో వినోద్ సిద్ధహస్తుడు. వివేకా ఫ్లెక్సీలు కట్టించాలన్నా, ఇంకేదన్నా డిజైన్‌లు కావాలన్నా ముందుగా వినోద్‌నే పిలిపించుకునేవాడు. 2010లో వై.యస్. ప్రథమ వర్ధంతి సందర్భంగా వివేకా, వినోద్ చేత డిజైన్ చేయించి నగరమంతా కట్టించిన ఫ్లెక్సీలు ప్రజలను విశేషంగా ఆకర్షించడమే కాదు, జగన్ దృష్టిలో కూడా పడ్డాయి. ఈ ఫ్లెక్సీ డిజైన్‌ల కోసం వస్తూపోతూ వినోద్ వివేకా అనుచరుడిగా మారాడు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో క్రియాశీలక కార్యకర్త అయ్యాడు. ఆనం వివేకా అనుచరుడిగానే జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగా, ఆ తర్వాత అధ్యక్షుడిగా పదవులు నిర్వహిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ, జాతీయ స్థాయిలోనూ ఫోకస్ అయ్యాడు. వినోద్‌లోని చురుకుదనాన్ని చూసి సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌ఛార్జ్ బాధ్యతలు కూడా అప్పగించారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ జిల్లాలో నాయకులు చాలామంది కాంగ్రెస్‌ను వదిలి వెళ్లారు. కాని కష్టకాలంలో వినోద్ మాత్రం కాంగ్రెస్‌ను వదల్లేదు. ఎన్నికల తర్వాత తన బాస్ వివేకాకు అతను దూరమయ్యాడు. సొంతంగానే తనకున్న సొంత బలంతోనే పార్టీ కార్యక్రమాలను ఉత్సాహంగా జరుపుతున్నాడు. ఈమధ్య ఆనం సోదరులు కాంగ్రెస్‌ను వదిలిపోవడం తెలిసిందే! ఇక కాంగ్రెస్‌లో చాలా తక్కువ మంది నాయకులే మిగిలి వున్నారు. పనబాక లక్ష్మి వంటి వాళ్లున్నా ఈ జిల్లాలో జరిగే కార్యక్రమాలలో ఆమె వేలు పెట్టడంలేదు. ఏమైనా ఆరం భారం అంతా వినోద్ మీదే పడుతోంది. ఇటీవల పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి జిల్లా పర్యటనను సైతం వినోద్‌రెడ్డి తన భుజాలపైనే మోసి విజయవంతం చేసాడు. కాంగ్రెస్ చరిత్రను పరిశీలిస్తే విద్యార్థి స్థాయి నుంచి కష్టపడి ఎమ్మెల్సీలుగా, ఎమ్మెల్యేలుగా, పార్లమెంటు సభ్యులుగా, కేంద్రమంత్రులుగా ఎదిగిన నాయకులు ఎంతోమంది ఉన్నారు. నేదురుమల్లి వంటివారు 1978 ప్రాంతంలో కష్టకాలంలో కాంగ్రెస్‌కు అండగా ఉండబట్టే సీఎం స్థాయికి పోగలిగారు. కాంగ్రెస్‌ను నమ్ముకుంటే ప్రజల్లో పరపతి లేకున్నా, రాజకీయ నేపథ్యం లేకున్నా అదృష్టం దక్కిన సందర్భాలెన్నో వున్నాయి. గడ్డుకాలంలోనూ కాంగ్రెస్‌ను కనిపెట్టుకుని, ఆ పార్టీ కోసం తపిస్తున్న వినోద్‌కు కూడా మంచి భవిష్యత్ ఉంటుందనేది పలువురి అభిప్రాయం.

# నిశ్చయతాంబూలం

## దివ్య - వరుణ్



**కోవూరు శాసనసభ్యుడు, స్వల్పకాలంలోనే సుధీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుల స్థాయికి చేరుకున్న రాజకీయ నాయకుడు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శ్రీమతి అరుణల కుమార్తె దివ్య నిశ్చితార్ధ మహోత్సవం వరుణ్‌తో డిసెంబర్ 6వ తేదీ ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఇటు పెళ్ళికుమార్తె తరపున జిల్లాతో పాటు రాష్ట్రానికి చెందిన అనేకమంది రాజకీయ, వ్యాపార ప్రముఖులు పాల్గొనగా, మాజీమంత్రిగా తెలంగాణలో పరపతి కలిగిన రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి శ్రీమతి డి.కె.అరుణకు పెళ్ళి కొడుకు స్వయాన సోదరి కుమారుడు కావడంతో అటు పెళ్ళికుమారుడు తరపున కూడా తెలంగాణ రాజకీయ నేతలు పారిశ్రామిక వేత్తలు అధికసంఖ్యలో ఈ నిశ్చితార్ధ వేడుకలో పాల్గొన్నారు.**



# జాక్‌పాట్ మంత్రికేం తెలుస్తుంది... జనం బాధ!

### - ఎమ్మెల్యే ప్రతాప్



ఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రజలతో సంబంధాలు లేని మంత్రి నారాయణకు ప్రజల చేత ఎన్నుకోబడిన తనను విమర్శించే అర్హత లేదని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కావలిలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను బెంగుళూరులో వ్యాపారాలు చేసుకుంటూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేననడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో టిడిపి ఎమ్మెల్యేలు ముగ్గురున్నారని, వారిలో ఏ ఒక్కరి కన్నా జిల్లాలో ఒక్కరోజు తక్కువగా వున్నట్లుగా ఆధారాలతో నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ముంపు బాధితులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను జన్మభూమి కమిటీల పేరుతో స్వాహా చేస్తుంటే అది నిలదీసిన నాపై మంత్రి విమర్శించడం సిగ్గుచేటన్నారు. కావలి ప్రాంతంలో అర్ధరాత్రులు పర్యటించే మీరు స్థానిక ఎమ్మెల్యే అయిన తనకు సమాచారం ఇవ్వలేదని అన్నారు. ఎందుకంటే స్థానిక సమస్యలు మీరు పరిష్కరించ లేరు గనుకనే అన్నారు. కనీసం ప్రజలకైనా వారి సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వాలని, లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావలసి వస్తుందన్నారు. మున్సిపాలిటీలోని సమస్యలు వివరించేందుకు కౌన్సిలర్లతో కలిసి వస్తే టిడిపిలో చేరమని సూచించడం, లేకపోతే ప్రక్కకు వెళ్లండని మాట్లాడటం దారుణమన్నారు. ఇలా ప్రవర్తించబట్టే ఆయనకు జాక్‌పాట్ మంత్రిగా ప్రజల్లో పేరుపడిందన్నారు. మున్సిపల్‌శాఖామంత్రి అయిన ఆయన మున్సిపాలిటీల సమస్యలు కూడా విని పరిష్కరించలేకపోతే దేనికన్నారు. ఇలాంటి మంత్రుల వల్ల ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందన్నారు. అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికారప్రతి నిధి కామరాజు, జిల్లా కార్యదర్శులు ప్రసన్నాంజనేయులు, చిట్టిబాబు, జిల్లా కార్యవర్గసభ్యులు అనుమాలశెట్టి శివ, అంకబాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.వెంకట నారాయణ, కిషోర్‌గుప్తా, కౌన్సిలర్లు, చేవూరు తిరుపాలు, డేగా రామయ్యయాదవ్, మందా శ్రీనివాసులు, నాయకులు హమీద్, కందుర్తి కామయ్య, రాఘవులు, కౌన్సిలర్ నున్నా వెంకట్రావు, పద్మనాభరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాధవరెడ్డి తదితరులున్నారు.

# మంత్రి మీద ఈగను కూడా వాలనివ్వం





మూడేళ్లలో మూడుపార్టీలు మారిన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మంత్రి నారాయణను విమర్శించే స్థాయి లేదని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలు పేర్కొన్నారు. బుధవారం వెంకటగిరిలో వారు మాట్లాడారు. తన అనుమతి లేకుండా కావలి నియోజకవర్గంలో అడుగుపెట్టొద్దని మంత్రినుద్దేశించి ప్రతాప్‌రెడ్డి వ్యాఖ్యానించడం విడ్డూరంగా వుందని, ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేకపోయినప్పటికీ ఆయన ఎన్నో ఏళ్ల నుండి తెలుగుదేశంపార్టీకి సేవలందిస్తున్న గొప్ప విద్యావేత్తని, రాజకీయాలలో అనుభవం లేకున్నా ముందుచూపుంది కాబట్టే గత ఏడాది జిల్లాలో 42శాతం వర్షాలు తక్కువుగా కురిసినా 8లక్షల ఎకరాలకు సాగునీరిచ్చి పంటలను కాపాడారని, ఆయనను అనరాని మాటలంటే కళ్లు పోతాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు తెలియని వాళ్లు ఎమ్మెల్యేలయితే ఎలా వుంటుందో ప్రతాప్‌రెడ్డి నిరూపిస్తున్నారన్నారు.

### కాలధర్మం

# సన్నారెడ్డి సరస్వతమ్మ



దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామికవాడగా గుర్తింపు పొంది, దేశ, విదేశాల పారిశ్రామిక దిగ్గజాల ప్రశంసలందుకుంటున్న తడలోని శ్రీసిటీ సెజ్ రూపశిల్పి రవి సన్నారెడ్డి తన మాతృమూర్తిని కోల్పోయారు. ఈ నెల 10వ తేదీ గురువారం(నిన్న) సాయంత్రం ఆయన తల్లి సన్నారెడ్డి సరస్వతమ్మ తన 78వ యేట చెన్నైలో ఆకస్మికంగా కనుమూసారు. ఆమె భర్త రాజగోపాల్‌రెడ్డి స్వగ్రామం సూళ్లూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు. మంచి రైతుగా, ఆధ్యాత్మిక తత్పరుడిగా రాజగోపాల్‌రెడ్డి, ఆయన ద్వారా సరస్వతమ్మ సూళ్లూరు పేట పరిసర ప్రాంతాల్లో అందరికీ సుపరిచితులే. సరస్వతమ్మకు కుమారుడు రవి, కుమార్తె అనిత ఉన్నారు. శ్రీసిటీ ద్వారా రాష్ట్రంలోనే కాక దేశంలోనూ, అంతర్జా తీయం గాను రవి సన్నారెడ్డిని తెలియని పారిశ్రామిక ప్రముఖులు లేరు. కుమార్తె అనిత, అల్లుడు విజయకృష్ణ, మనుమలు మనుమరాండ్రు అమెరికాలో స్థిరపడ్డారు. 11వ తేదీ శుక్రవారం ఉదయం ఆమె భౌతిక దేహాన్ని మన్నారుపోలూరుకి తీసుకురానున్నట్లు, 12వ తేదీ శనివారం నాడు ఆమె అంతిమ క్రియలు జరుపనున్నట్లు తెలిసింది. భార్యను కోల్పోయి దుఃఖసాగరంలో వున్న రాజగోపాలరెడ్డికి, వారి కుమారుడు రవి సన్నారెడ్డికి, ఇతర కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ సరస్వతమ్మ మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తోంది 'లాయర్'.

## 'ప్రభా'తం

# ప్రకృతి నేర్పిన పాఠాలు

**అది చెన్నై మహానగరమే అయినా, నెల్లూరు పట్టణమైనా ప్రకృతి విపత్తుల నుంచి ముందు జాగ్రత్తలు తీసుకోనందుకు భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తుంది. సహజసిద్ధమైన నదులు, చెరువులు, సరస్సులు, కాలువలు, వాగులు వంకలు సైతం ఆక్రమణలకు గురై, వరదనీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడం వంటివన్నీ మానవ తప్పిదాలే. ఇకనైనా చెన్నైని ముంచిన వరదలు..ప్రకృతి మనకు నేర్పిన గుణపాఠాలుగా తీసుకొని భవిష్యత్తులోనైనా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి వుంది.**



వర్షాలు, వరదలు, తుఫాన్‌లు వగైరా ప్రకృతి విపత్తులు ఎంతో కాలంగా మానవాళిని అతలాకుతలం చేస్తూనే వున్నాయి. ఎప్పుడు ఎక్కడ ఎలాంటి విలయం వచ్చి ముంచిపోతుందో ఎవరికీ తెలియని పరిస్థితి. అయితే, శాస్త్ర సాంకేతిక రంగాలు శరవేగంగా విస్తరిస్తున్న నేటికాలంలో ఇలాంటి విపత్తుల సమాచారం చాలా వరకు పసిగడుతున్నప్పటికీ, అలాంటి ప్రమాదాల నుంచి ప్రాణనష్టం, ఆస్తినష్టం భారీగా వాటిల్లకుండా ఆయా ప్రాంతాల్లో ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోలేకపోవడం పెద్ద శాపమనే చెప్పాలి. సహజసిద్ధంగా అప్పటికప్పుడు సముద్రంలో ఏ అల్పపీడనమో వచ్చి వాయుగుండంగా మారి వర్షాలతో వరదగుండాలను తెచ్చి జనావాసాలను నీట ముంచుతున్నా, ఎంతోకాలంగా నిర్లక్ష్యంతో వున్న మనం ఇకనైనా ఇలాంటి వరదల నుంచి, ప్రకృతి విపత్తుల నుంచి తెలుసుకోవాల్సింది ఎంతో వుంది. ముఖ్యంగా చెన్నై వరదల నుంచి గుణపాఠాలు చాలానే నేర్చుకోవాల్సి వుంది. ఇటీవల వచ్చిన వరదల ధాటికి చెన్నై విలవిలలాడింది. గత వారం రోజులుగా కురుస్తున్న వానల్లో ఒకరోజు 108 మిల్లీమీటర్ల కుండపోత వాన ముంచుకువచ్చింది. దాదాపు ఈ వందేళ్ళలోనే ఏనాడూ కనీవినీ ఎరుగని కుంభవృష్టితో చెన్నై అతలాకుతలమైంది. మొదట చిరుజల్లులుగా మొదలైన వాన ఆ తర్వాత వాగులుగా వరదలుగా మారింది. కొద్ది గంటల్లోనే విలయంలా మారి జల ప్రళయాన్నే సృష్టించి చివరికి మహానగరాన్నే ముంచెత్తింది. ఈ వరదల దెబ్బకు సుమారు 300 మందికి పైగానే మృతి చెందారు. లక్ష కోట్లకు పైగానే ఆస్తి నష్టం వాటిల్లిందంటే నష్టం ఎంత అపారమో అర్థమవుతుంది. లక్షలాదిమంది జనం నిరాశ్రయులై అలమటించారు. ఎక్కడ చూసినా వరదనీటితో చెన్నై ఒక మహా సముద్రాన్ని తలపించింది. లక్షలాది మంది ఇళ్ళు నీట మునిగాయి. ప్రజలు ఈ వారం రోజులు తాగడానికి గుక్కెడు నీళ్ళుకానీ, పిడికెడన్నం కూడా దొరక్క, పడిన అవస్థలు వర్ణనాతీతం. దాదాపు 30 విద్యుత్ కేంద్రాలు మునిగిపోయి. నగరంలో అంధకారమే మిగిలింది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో ముఖ్యమైన సమాచార వ్యవస్థ తదితర అన్ని వ్యవస్థలూ కుప్పకూలి పోయాయి. వీటన్నిటికీ మానవ తప్పిదం కూడా కారణమేమోనని అనిపిస్తోంది.

ఏళ్ళ తరబడిగా ఇలాంటి విపత్తులు దేశవ్యాప్తంగా అక్కడక్కడా అప్పుడప్పుడూ వస్తూనే వున్నా మనం ఇంకా నిర్లక్ష్యంలోనే వున్నామా?.. నగరాలు, పట్టణాలు అన్నీ కాంక్రీట్‌మయం అయిపోతున్నా, దురాక్రమణలు కొల్లలుగా పెరిగిపోతున్నా, సహజసిద్ధమైన నీటివనరులన్నీ ఆక్రమణలకు గురై మిద్దెలు మేడలతో నిండిపోతున్నా, చివరికి వరద నీరు సముద్రంలోకి వెళ్లేందుకు కూడా దారిలేక నగరాలనే నీట ముంచుతున్నా ఇంకా మనం ఏమీ నేర్చుకోలేకపోతున్నామా?.. అందరూ ఆలోచించుకోవాల్సిన తరుణమిది. అయినా, వర్షాలు వరద భీభత్సాలు చెన్నైకి కొత్తేమీ కాదు. గతంలో ఇంత భారీ వర్షాలు కురిసినా కొద్ది గంటల్లోనే ఆ నీరంతా సముద్రంలోకి వెళ్ళిపోయేది, ఇప్పుడా పరిస్థితి లేకపోవడం మానవ తప్పిదమేనని ఇకనైనా గుర్తించాలి. అసలే మురుగునీరు, వర్షపునీరు వెళ్ళేందుకు అవసరమైన డ్రైన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం దారుణం. వరదల్లాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు సక్రమమైన ప్రణాళికలు లేకపోవడం, ముందు జాగ్రత్తల పట్ల ఆసక్తి లేకపోవడం వంటివన్నీ ఈ సందర్భంగా గమనార్హాలే. అడ్డూ అదుపు లేని ఆక్రమణలతో వేలాది ఎకరాల విస్తీర్ణం వున్న చెరువులన్నీ కుంచించుకుపోయాయి. కాలువలు, సరస్సులన్నీ కుదించుకుపోయాయి. మరోవైపు, ఓ 50 ఏళ్ళ క్రితం 425 కిలోమీటర్ల విస్తీర్ణం వున్న చెన్నై నగరం కాస్తా ఇప్పుడు 1200 కిలోమీటర్ల దాకా పెరిగింది. ఇంత స్థాయిలో నగరం విస్తరించినా అందుకుతగ్గట్టుగా డ్రైన్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం చెన్నైకి శాపమైంది. అభివృద్ధిని ఎవరూ కాదనలేరు కానీ, విస్తరణ పేరుతో వున్న సహజవనరులన్నీ ఆక్రమణలకు గురవుతున్నా, సరైన ప్రణాళికలు లేకుండా వుండడం వల్లనే ఇలాంటి దుస్థితి ఏర్పడిందని అనుకోవచ్చు. ముందుజాగ్రత్త లేక మొదటికే ముంపు వచ్చే పరిస్థితిని తెచ్చుకోవడమే బాధాకరం. ఎంతటి వర్షపునీటినైనా పొదివి పట్టుకునేంతగా పెద్దసంఖ్యలో చెరువులూ రిజర్వాయర్లు లేకపోవడం ఎంతోకాలం నుంచి వున్న లోటు. ఈ కొరతను భవిష్యత్తులోనైనా అన్నిప్రాంతాలవారూ పూరించుకోవాల్సి వుంది. రాష్ట్రంలోనూ నవంబర్‌లో కురిసిన భారీ వర్షాలు వరదలతో 6750 కోట్లకు పైగానే నష్టం వాటిల్లింది. వరద జిల్లాల్లో మొత్తం 81 మంది మృతి చెందారు. నెల్లూరు, చిత్తూరు, కడప, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఇకనైనా ఇలాంటి విపత్తులను ఎదుర్కొనేందుకు సరైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి వుంది. అయినా, చెన్నైలో జరిగిన నష్టం మరీ అపారం. ఇంతటి ఉపద్రం చెన్నైకి ఈ వందేళ్లలో ఇదే తొలిసారి. ఇంత భారీ వానలు వచ్చి నగరాన్ని పీకల దాకా ముంచే స్థాయిని ఎవరూ ఊహించలేదు కూడా. అయినప్పటికీ నేటికీ చెన్నై గుండె నిబ్బరంతో ఆ కష్టాలన్నిటినీ సహిస్తూనే వుంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బాధితులకు తగు సాయం అందించడంతో కొంత చేయూత దొరికినట్లయింది. అధికార యంత్రాంగంతో పాటు సైన్యం, వాయుసేన, జాతీయ విపత్తు బృందాలు, స్వచ్ఛందసేవాసంస్థలు, దాతలు, మానవతావాదులు అందరూ.. ఎందరో మహానుభావులు అందరూ హుటాహుటిన స్పందించి నీట మునిగిన తమిళనాడు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు తమ వంతు ఆదరహస్తం అందిస్తుండడం ఎంతైనా అభినందనీయం. ఈ కష్టసమయంలో బాధితులను ప్రతిఒక్కరూ ఆదుకోవాల్సివుంది. ఏదేమైనా ప్రకృతి విపత్తుల నుంచి మనం నేర్చుకోవాల్సింది ఇంకా ఎంతో వుంది. మానవ తప్పిదాలకు తావు లేకుండా, భవిష్యత్తులోనైనా ఈ కష్టాలను అధిగమించేందుకు ఇప్పటినుంచే మరింతగా సన్నద్ధం కావాల్సి వుంది.

# సామాజిక చైతన్యం పెంపొందించే రచనలు చేయాలి

**- సాహితీవేత్తల ఆకాంక్ష**



ప్రజలను చైతన్యవంతం చేసే మేలైన రచనలు వచ్చేలా కవులు, రచయితలను ప్రోత్సహించేందుకు సాహిత్య పురస్కారాలు అందజేయడం ఎంతైనా అభినందనీయమని పలువురు సాహితీవేత్తలు ప్రశంసించారు. ఇలాంటి సాహితీపురస్కారాలు కవులు, రచయితలకు ప్రోత్సహకరంగా వుంటాయని వారన్నారు. కవులు -రచయితలు సామాజిక చైతన్యం మరింతగా పెంపొందించేవిధంగా రచనలు చేయాలని ఈ సందర్భంగా వక్తలు ఆకాంక్షించారు.

ఈ నెల 6న నెల్లూరులోని ఐఎంఏ హాల్‌లో సోమిరెడ్డి జమున స్మారక రాష్ట్రస్థాయి నానీల అవార్డు, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద నవలా పురస్కారాల ప్రదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్తలు కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నియోగి, చిన్ని నారాయణరావు మాట్లాడుతూ, సాహితీ రంగంలో డాక్టర్ జయప్రద చేస్తున్న కృషిని కొనియాడారు. కవులు, రచయితలు కాలక్షేపానికి కాక తమ రచనలతో సామాజిక చైతన్యానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నానీల అవార్డుకు నల్గొండ జిల్లాకు చెందిన 'బడి' నానీల రచయిత డాక్టర్ పోరెడ్డి రంగయ్యకు, నవలా పురస్కారాన్ని విశాఖపట్నానికి చెందిన 'వికర్త' నవలా రచయిత డాక్టర్ చింతికింది శ్రీనివాసరావులకు ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ పెళ్ళకూరు జయప్రద రచించిన 'చిరుదీపాలు' రెక్కల సంపుటిని ఆవిష్కరించారు. పెన్నా రచయితల సంఘం నిర్వహణలో, డాక్టర్ సోమిరెడ్డి జయప్రద-వెంకటశేషారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పెరసం కార్యదర్శి సుభద్రాదేవి, మోపూరు పెంచలనరసింహం, కోసూరు రత్నం, చంద్రమౌళి, గుర్రాల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వం.. శ్రీ మూలస్థానేశ్వరుని కల్యాణం



కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 6న నెల్లూరు మూలాపేటలో వెలసివున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి అన్నాభిషేకం, విశేష పూజలు, ప్రాకారోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవానికి మోదెం సత్యనారాయణ గుప్తా, అన్నాభిషేకానికి రేబాల వెంకటరెడ్డి, ఇందిరమ్మ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షులు ఆల్తూరి గిరీష్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి జనార్ధనరెడ్డి పర్యవేక్షణలో ఈ వేడుక జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు.




## కొలిక్కిరాని కొలీజియమ్

దిక్కులేని వారికి దేవుడే దిక్కు! ఎవరికైనా అన్యాయం జరిగితే కోర్టులను ఆశ్రయిస్తారు, కోర్టులలో వాదించే న్యాయమూర్తులు ప్రలోభాలకు లొంగకూడదు. వాదనలో ఆశ్రితపక్షపాతం ఉండకూడదు. కులం మతాలకు అతీతంగా వాదించాలి. ఈ లక్షణాలన్నీ న్యాయదేవతకు మచ్చతెచ్చేవే! అసలు విషయానికొస్తే కొలీజియమ్ వ్యవస్థను గురించి జనాభిప్రాయం కోరింది సుప్రీమ్ కోర్ట్. పాపం ప్రజలకేం తెలుసు! న్యాయమూర్తులకే భిన్నాభిప్రాయాలున్నాయి. డబ్బు తీసుకుని బెయిల్ ఇవ్వడం, తమకు ఇష్టంలేని కేసులు వస్తే 'నాట్ బిఫోరమి' అని చెప్పడం, రాజకీయ నాయకులిచ్చే కానుకలకు లొంగడం... ఈ దుర్గుణాలు న్యాయమూర్తులలో వున్నంతకాలం న్యాయదేవతకు అగచాట్లే!

**- కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

## దాతృత్వం అభినందనీయం

దేశంలో ఎక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా బాధితులను ఆదుకోవడానికి సినీ రంగం ముందుకు వస్తుండడం అభినందనీయం. చెన్నై వరద బాధితులకు తమిళ, తెలుగు సినీ పరిశ్రమ అండగా నిలబడింది. తమిళహీరో విజయ్ 5కోట్లు, లారెన్స్ కోటి, అజిత్ 60లక్షల విరాళాలతో పాటు తమిళ, తెలుగు సినీహీరోలు, తారలు, నటులు తమకు తోచిన విరాళాలు ప్రకటించి తమవంతు సాయం అందించి అందరికీ మార్గదర్శకంగా నిలిచారు.

**- సతీష్.కె, చెన్నై.**

## అవార్డులు అప్పుడే ఇచ్చుండాలి!

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఏ రచయిత నవలలు నిషేధించ లేదు. ఏ సినిమాలనూ ఆపలేదు. కాని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాల్మన్ రష్దీ వ్రాసిన 'సటానిక్ వర్సెస్' అనే నవలను నిషేధించింది. తస్లీమా నస్రీన్ పై దాడి చేసిన దుండగులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ దేశంలో రచయితలకు చీము, నెత్తురు ఉండుంటే అవార్డులను ఇప్పుడు కాదు, అప్పుడే వెనక్కి ఇచ్చేసి ఉండాలి.

**- వి.శారద, హైదరాబాద్.**

## తినడానికి ఇంకేం లేదా?

హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఫ్ ఫెస్టివల్ నిర్వహిస్తామంటున్నారు. అతివాద పోకడలకు ఇదో ఉదాహరణ. పవిత్ర విద్యాలయంలో ఈ వికృతపోకడలేంటి! దేశంలో తినడానికి ఇంకేం లేనట్లు గోవులను వధించడమేమిటి? కేవలం ఒక వర్గం వారి మనోభావాలను గాయపరచడానికి చేసే ఇలాంటి వికృత, వికార కార్యక్రమాలను నిషేధించాలి. హిందువుల మనోభావాలను గాయపరిచే కార్యక్రమాలను అడ్డుకుంటే సహనం కోల్పోయారని ప్రచారం చేస్తున్నారు. మరి ఇలాంటి కార్యక్రమాలు సహనం క్రిందకు వస్తాయా?

**సి.రాజీవి, నెల్లూరు.**

# వరద బాధితులకు స'పోర్ట్'గా సివిఆర్ ఫౌండేషన్ చేయూత






**కృష్ణపట్నం పోర్టు... నెల్లూరు జిల్లాకు ఇది పెద్ద కానుక. జిల్లాలో ఈ పోర్టు ఉండబట్టే ఈ జిల్లా పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం కాగలిగింది. ఈ పోర్టు రాబట్టే భూముల ధరలు అమాంతం పెరగడం, ఎంతోమంది లక్షాధికారులు, కోటీశ్వరులు కావడం జరిగింది. ఈ పోర్టు వల్లే ఎన్నో వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి. ఈ పోర్టు ఉండడం వల్లే ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికొస్తున్న అన్ని విదేశీ కంపెనీలు నెల్లూరుజిల్లా వైపు చూస్తున్నాయి.**

కృష్ణపట్నం పోర్టు జిల్లాకు ఆర్థికాభివృద్ధిలోనే కాదు, సామాజిక సేవాపరంగా కూడా అండగా నిలుస్తోంది. కృష్ణపట్నం పోర్టు కంపెనీ సిఎస్ఆర్ నిధులతో జిల్లాలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పోర్టు పరిధిలోకి వచ్చే ముత్తుకూరు, వెంకటాచలం, చిల్లకూరు మండలాల్లోని అన్ని గ్రామాలకు మంచినీటి సరఫరాతో పాటు కాలుష్య నివారణకు ఈ మండలాల్లోని గ్రామాలలో మొక్కలు నాటడం, కమ్యూనిటీ హాల్స్ నిర్మించడం వంటివి చేశారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు వద్ద 'నవనీతం' పేరుతో ఆధునిక విద్యా కేంద్రాన్ని నెలకొల్పారు. నెల్లూరు నగరంలోనూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

తాజాగా నెల్లూరును మరియు చెన్నైను వరదలు ముంచెత్తి, ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిన నేపథ్యంలో కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో సివిఆర్ ఫౌండేషన్ పోషించిన మానవతాపాత్ర అభినందనీయం. నెల్లూరులో వరదలు సంభవించినప్పుడు పలు గ్రామాలలో బాధితులకు ఆహారం ప్యాకెట్లను సివిఆర్ ఫౌండేషన్ అందజేసింది. నెల్లూరులో వరద కాలువలను తవ్వడానికి, బురదను ఎత్తి దూరప్రాంతాలకు తరలించడానికి పోర్టుకు సంబంధించిన వాహనాలనే ఉపయోగించారు. నెల్లూరు వరదలలో పోర్టు హెలికాప్టర్‌ను వాడి బాధితులను ఆదుకున్నారు.

ఇప్పుడు చెన్నై వరదల నేపథ్యంలోనూ సివిఆర్ ఫౌండేషన్ బ్రహ్మాండంగా పని చేసింది. చుట్టూ నీళ్లు చుట్టుముట్టి తిండి తిప్పలు లేకుండా అల్లాడిన వేలాది మంది బాధితులకు హెలికాప్టర్ ద్వారా ఆహార పొట్లాలు అందజేసి వారి ఆకలి తీర్చింది. నెల్లూరుజిల్లా నుండి పెద్దఎత్తున సహాయ సామాగ్రిని చెన్నైకు తరలించి బాధితులకు అందజేశారు. పోర్టులో జరిగే నిరంతర కార్యక్రమాలను కూడా వదిలేసి పోర్టు సిఇఓ ఎండ్లూరి అనిల్‌కుమార్, పిఆర్ఓ వేణుగోపాల్ వారి సిబ్బందితో వరద బాధితుల సేవలో నిమగ్నమై పని చేసారు.

ఇక పోర్టు అధినేతలు సి.విశ్వేశ్వరరావు, సి.శశిధర్‌లు ఈ సేవా కార్యక్రమాలను నిర్విఘ్నంగా జరిపించడంలో తమ సిబ్బం దికి పూర్తి స్వేచ్ఛనిచ్చి ఇన్ని మంచి పనులు చేయిస్తున్నారు. వీరందరికీ హేట్సాఫ్!

# ముందు మీ నుండే మొదలుపెట్టండి

## - మంత్రి నారాయణకు కోటంరెడ్డి సలహా...



నెల్లూరు నగరంలో ఆక్రమణల తొలగింపు ముందు మంత్రి నారాయణ గారి విద్యాసంస్థల నుండే మొదలు కావాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 7వ తేదీ నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో పంట కాలువల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని, ఎలాంటి బడాబాబులనైనా వదిలేది లేదని మంత్రి నారాయణ చెప్పారు. ఆయన ఉక్కుపాదం పెట్టినా, ఇత్తడి పాదం పెట్టినా మేము స్వాగతిస్తాం, అయితే ఆ పాదమేదో ముందు ఆయన విద్యాసంస్థల ఆక్రమణల మీదే పెట్టాలని మా విన్నపం. చింతారెడ్డిపాలెం, నెల్లూరు బిట్-2, సర్వేనెంబర్ 994లో 700అడుగుల మేర పంట కాలువలను ఆక్రమించుకుని ఆయన విద్యాసంస్థలు కట్టారు. ఇది నేరమా? కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఆక్రమణల తొలగింపును ఇక్కడ నుండి మొదలుపెడితే మంత్రి తన నిజాయితీని నిరూపించుకున్నట్లవుతుందన్నారు. ఆక్రమణల తొలగింపుకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వం నుండి పట్టాలు తెచ్చుకుని చిన్నచిన్న ఇళ్లు కట్టుకుని బ్రతుకుతున్న వారిని మాత్రమే తొలగించడం సరికాదన్నారు. ఎలాంటి ఆసరాలేని చిన్న, సన్న జనానికి ప్రత్యామ్నాయం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైకాపా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ ప్రదాతకు ప్రణామం

డా॥ బి.ఆర్.అంబేద్కర్ 59వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఓ బి.రామిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గత బలం తిరిగొచ్చేనా?



**ఆనం వాళ్లకు అధికారం ఆసరా అవసరం. చంద్రబాబుకు నెల్లూరుజిల్లాలో బలమైన నాయకత్వం అవసరం. పరస్పర అవసరాలు ఇద్దరినీ దగ్గర చేసాయి. ఈ జిల్లాలో గత పదేళ్ల నుండి ఆనం వాళ్లతో పోరాడి ఇళ్లు ఒళ్లు గుల్ల చేసుకున్న తన పార్టీ నాయకుల సంగతి ఏంటని చంద్రబాబు ఆలోచించలేదు. ఇంతకాలం నోరు పగిలేలా చంద్రబాబును తిట్టి ఈరోజు ఆయన వద్దకే పోతే జనం ఏమనుకుంటారా అని ఆనం సోదరులూ ఆలోచించలేదు. వారిద్దరి కలయిక ఆ విధంగా జరిగిపోయింది.**

అయితే చంద్రబాబు ఏ బలాన్నయితే ఆశించి ఆనం సోదరులను తన పార్టీలో చేర్చుకున్నాడో ఆ బలం ఇప్పుడు ఆనం సోదరుల వెనుక ఉందా? అన్నది ప్రశ్నగా మిగిలింది. నిజమే కాంగ్రెస్ ప్రభుత్వంలో వాళ్లు బలీయమైన రాజకీయశక్తులు. ఆనం వివేకానందరెడ్డి ఎప్పుడైతే మున్సిపల్ ఛైర్మెన్‌గా గెలిచాడో అప్పటి నుండి ఆనం వర్గం అంచలంచెలుగా పెరిగింది. 1999 నుండి ఒకే ఇంట్లో ఇద్దరు ఎమ్మెల్యేలు కావడంతో ఇక వారి ఊపుకు అడ్డే లేకుండా పోయింది. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వై.యస్. వాళ్లకు ఫ్రీ హ్యాండిచ్చాడు. ఇంకేముంది జిల్లాలో అనకొండ లాంటి నేదురుమల్లి వర్గాన్ని కూడా చిత్తు చేసారు. 2009 ఎన్నికలొచ్చే సరికి నేదురుమల్లి వర్గాన్ని నామరూపాలు లేకుండా చేసి జిల్లా కాంగ్రెస్‌పార్టీని పూర్తిగా ఆక్రమించేసారు. 2014 ఎన్నికలకు ముందు దాకా ఈ జిల్లాలో ఆనం హవా సాగింది. వీరి వెనుక పెద్ద అనుచరగణమే వుండేది. ప్రతి నియోజకవర్గంలోనూ మేం ఆనం అనుచరులం అని చెప్పుకునే నాయకులు పోగయ్యారు. ఆత్మకూరు నియోజకవర్గంలో అయితే మేకపాటి సోదరుల సొంత గ్రామంలోనే కాంగ్రెస్ గెలిచే స్థాయికి ఆనం వర్గం బలపడింది. నెల్లూరులో అయితే వివేకా దెబ్బకు తెలుగుదేశం నామరూపాలు లేకుండా పోయింది. ఆత్మకూరులో ఆనం వెనుక, నెల్లూరులో వివేకా వెనుక పెద్ద అనుచర నాయకగణం వుండేది.

కాని రాష్ట్ర విభజన చాలామందిలాగే ఆనం సోదరుల తలరాతను కూడా మార్చేసింది. తప్పని పరిస్థితుల్లో ఆనం కుటుంబం నుండి 2014ఎన్నికల్లో ముగ్గురు(ఆనం రామనారాయణరెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఏసి సుబ్బారెడ్డి) పోటీ చేసినా ఒక్కరికీ డిపాజిట్ దక్కలేదు. వీళ్లు పోగుచేసిన (మిగతా 11వ పేజీలో)

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



# నెల్లూరు కబుర్లు

### సడి సందడి లేకుండా
## నెల్లూరుకు ఆనం

తెలుగుదేశంలో చేరాక మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 5వ తేదీన నెల్లూరుకొచ్చారు. అయితే ఆయన ఎలాంటి హంగామా చేయలేదు. ఆ విధంగా చేసుకోలేరు కూడా! చేసింది ఘనకార్యమేమీ కాదు. రామనారాయణకు డీసీసీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డితో పాటు మరో ఇద్దరు స్వాగతం పలికారు. కాగా వివేకా 8వ తేదీ నెల్లూరొచ్చారు.

## నెల్లూరు డిఎస్పీగా జె.వి రాముడు



నెల్లూరు నగర డిఎస్పీ మక్బూల్ బదిలీ కావడంతో, ఆయన స్థానంలో హైదరాబాద్ గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పని చేస్తున్న జె.వెంకటరాముడుని నియమించారు. ఆ మేరకు రాష్ట్ర డిజిపి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. 2012 బ్యాచ్‌కు చెందిన వెంకటరాముడు స్వస్థలం అనంతపురం జిల్లా. సర్వీసు ప్రారంభం నుంచి ఆయన గ్రేహౌండ్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. నెల్లూరు డిఎస్పీగా బదిలీ అయి వచ్చిన వెంకటరాముడుకు 'లాయర్' శుభాకాంక్షలు.

## గీతామయికి కిషోర్స్ రత్నం చేయూత



వృద్ధులు, అనాథలను ఆదుకునే ప్రయత్నంలో భాగంగా డా॥ కిషోర్స్‌రత్నం విద్యా సంస్థల తరఫున డా॥ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు తమ పాఠశాలలో గత నెల 28వ తేదీన 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రైమ్‌ఫేర్-15 కార్యక్రమం ద్వారా వసూలైన రూ.1,21,560లు నగదు మొత్తాన్ని ఓఎస్‌డి సిహెచ్ పెంచలరెడ్డి చేతుల మీదుగా గీతామయి వృద్ధాశ్రమానికి అందజేశారు. సోమవారం నెల్లూరు సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం రేస్ ఇంటర్నేషనల్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పెంచలరెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ప్రైమ్ ఫేర్-15 ద్వారా ఆర్ట్ & క్రాఫ్ట్, క్విజ్, ఫుడ్ కార్నివాల్ మరెన్నో కార్యక్రమాలు నిర్వహించి అక్కడ విక్రయించిన టిక్కెట్ల ద్వారా వసూలైన మొత్తాన్ని ఉదార స్వభావంతో గీతామయి వృద్ధాశ్రమానికి అందజేయడం అభినందనీయమన్నారు. డా॥ కిషోర్స్ రత్నం జెనెక్స్ స్కూల్ జనరల్‌మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ అనాథలు, వృద్ధులను ఆదుకోవడం మనందరి కర్తవ్యమని, ఈ విషయంలో డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థలు ఎల్లవేళలా ముందుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్స్ ప్రిన్సిపాల్స్, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ఏటీలు రుక్మిణి, సునీల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక సిబ్బంది వితరణ

ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదల్లో చెన్నై వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతో పాటు ఇళ్లలోని వస్తువులన్నీ ఎందుకూ పనికిరాకుండా పోయాయి. దీంతో నెల్లూరు అగ్నిమాపక శాఖ అధికారులు 130దుప్పట్లను కొనుగోలు చేసి చెన్నైకు పంపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి జ్ఞానసుందరం, ఎస్ఎఫ్ఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐఏబి సమావేశం

జిల్లా సాగునీటి సలహా సమావేశం ఈ నెల 12వతేదీ ఉదయం 10.30 గంటలకు నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్ జూబ్లీహాల్‌లో జరుగుతుందని ఇరిగేషన్ ఎస్ఇ పి.వి. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సోమశిలలో 70 టీఎంసీలు దాటాయి. కండలేరులో 28 టీఎంసీల దాకా వున్నాయి. నీటి పంపకా లపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.



### జాతీయస్థాయి ఖోఖోకు
## కెవిన్నార్ చిన్నారులు

జాతీయస్థాయిలో ఈనెల 8 నుంచి 15వ తేది దాకా చండీఘర్‌లో జరిగే అండర్-14 స్కూల్‌గేమ్స్ ఖోఖో పోటీలకు నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెవిఆర్ మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. ఇటీవలే రాష్ట్రస్థాయిలో శ్రీకాళహస్తిలో జరిగిన పోటీల్లో వీరు రాణించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన బి.పద్మ, ప్రసన్నకుమార్‌లను ఈ నెల 5న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయప్రకాష్‌రావు, పిఇటి అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు అందరూ అభినందించారు.

# స్టూడెంట్ దొంగలు
**• చెడిపోతున్న కుర్రకారు**

జల్సాలకు అలవాటు పడితే జులాయిలుగా మారాల్సిందే! ముఖ్యంగా చదువుకునే వయసులోనే స్పోర్ట్స్ బైక్‌లపై విన్యాసాలు, మద్యం, బార్లు, షికార్లకు అలవాటు పడుతున్న విద్యార్థులు చివరకు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. జల్సాల కోసం తల్లిదండ్రులు పంపిస్తున్న డబ్బులు చాలక దొంగతనాలకు తెగబడుతున్నారు. ఈమధ్య నగరంలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులలో నిందితులలో స్టూడెంట్స్ ఎక్కువ. తాజాగా ఒకటో నగర పోలీసులు మరో నలుగురు స్టూడెంట్ దొంగలను పట్టుకున్నారు. నెల్లూరులోని వెంకటేశ్వరపురం, బిట్రగుంటకు చెందిన ఇద్దరు ఇంటర్ విద్యార్థులు, పొదలకూరు, ఆత్మకూరు మండలం నువ్వూరుపాడుకు చెందిన మరో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు స్నేహితులు. తోటి విద్యార్థులు స్పోర్ట్స్ బైక్‌లపై చక్కర్లు కొడుతుంటే వీళ్లకు కూడా అలా తిరగాలనిపించింది. బైక్‌లు కొనాలంటే తల్లిదండ్రులిచ్చే డబ్బులు చాలవు. దీంతో బైక్‌లను దొంగలించే పనిలో పడ్డారు. దొంగలించిన బైక్‌లకు నెంబర్ ప్లేట్లు మార్చి తిరిగేవాళ్ళు. ఇటీవల పొగతోటలోని ఓ ఆసుపత్రి వద్ద వున్న బైక్‌ను దొంగలించి రిపేరు చేయిస్తుండగా అక్కడి వారికి అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులొచ్చి వీరిని పట్టుకుపోయి విచారించడంతో అసలు విషయం బయటపడింది.

## నాన్‌స్టాప్ బస్సులు వద్దు

నెల్లూరు - అల్లూరు మధ్య నెల్లూరు-2 డిపో వాళ్లు 5 నాన్‌స్టాప్ బస్సులను ప్రవేశపెట్టారు. అయితే దీనిని ఆర్టీసీ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఆర్డినరీకి నాన్‌స్టాప్‌కు మధ్య తేడా 20 నిముషాలేనని, దీనివల్ల కొంపలంటుకుపోవని, అల్లూరు - నెల్లూరుల మధ్య అంత అర్జంట్‌గా తిరిగేవాళ్లు కూడా వుండరని అంటున్నారు. అదీగాక నెల్లూరు, అల్లూరు మధ్యలో పడుగుపాడు సెంటర్, నార్తురాజుపాళెం స్టాపింగ్‌లలో ప్రయాణీకులు ఎక్కువుగా ఎక్కుతుంటారని, ఈ ఆదాయాన్ని ఎందుకు పోగొట్టుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు.

### ఎస్.ఎన్.ఏ.పి
## జిల్లా అధ్యక్షునిగా రామకృష్ణ



స్మాల్ అండ్ మీడియం డైలీ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా చెరుకూరు రామకృష్ణను నియమించినట్లు సంఘ రాష్ట్ర నాయకులు యం.జె.కుమార్‌రాజా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం గుంటూరు సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాకు సంబంధిత కార్యవర్గాల ఏర్పాటుకు కృషి జరుగుతోందని, అందులో భాగంగా నెల్లూరుజిల్లాకు అదే జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయులు చెరుకూరు రామకృష్ణను అధ్యక్షునిగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. రామకృష్ణ గతంలో పలు సంఘాలలో నాయకుడిగా వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని ఆయా సంఘాల అభ్యున్నతిలో భాగస్వాములయ్యారన్నారు.

## బిల్ కలెక్టర్ సస్పెండ్

పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సిన బిల్‌కలెక్టర్ గౌస్‌బాషా ఆలస్యంగా రావడంతో ఆగ్రహించిన నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి ఆయనను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేశారు. నగరంలోని 35వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ చేసే కేంద్రాన్ని ఈ నెల 5న కమిషనర్ పరిశీలించారు. అయితే, పింఛన్లు తీసుకునేందుకు వృద్ధులందరూ హాజరైనా గౌస్‌బాషా మాత్రం 11.30 గంటలు దాటినా రాకపోవడంతో ఆగ్రహించిన కమిషనర్ అతనిని వెంటనే సస్పెండ్ చేశారు.

### వరద బాధితుల పట్ల
## దొడ్ల వారి దొడ్డమనసు



చెన్నైలోని వరదబాధితులను ఆదుకునే క్రమంలో నెల్లూరురూరల్ దేవరపాలెం వద్ద వున్న దొడ్ల డెయిరీ వాళ్ల తమవంతు సాయం అందించారు. 10లక్షల రూపాయల విలువ చేసే పాలపొడి, మంచినీటి ప్యాకెట్లను తమ లారీల ద్వారా చెన్నైకి పంపించారు. దొడ్ల డెయిరీ సిబ్బంది అక్కడ బాధితులకు ఇవి పంచారు. పాల వ్యాపారంలోనే కాదు మానవత్వంలోనూ ముందు నడుస్తామని నిరూపించిన దొడ్ల డెయిరీ యం.డి దొడ్ల సురేష్‌రెడ్డి, వారి సిబ్బందికి 'లాయర్' అభినందనలు.

## చెన్నైలోనూ 'నేస్తం' ఆపన్న హస్తం



నెల్లూరు నగరంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆదర్శప్రాయంగా నిలుస్తున్న 'నేస్తం ఫౌండేషన్' యువకులు చెన్నైలోనూ తమ సేవలు అందిస్తున్నారు. పుదునగర్, పుదు బజార్, మంగార్ ఆర్చ్, తిరువత్తూర్, మణలి తదితర ప్రాంతాల్లో నేస్తం ఫౌండేషన్ సభ్యులు బాధితులకు దుప్పట్లు, కొవ్వొత్తులు, చపాతీలు, దోమల నివారణకు కాయిల్స్ పంపిణీ చేసారు. ఫౌండేషన్ అధ్యక్షులు కోరం ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకట్, శివ, చైతన్య, వినోద్, శ్రీకాంత్, తిరుపతి, సతీష్, ప్రత్యూష్, చెన్నకృష్ణలు ఈ సేవా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు పళ్ళాలు, గ్లాసులు



బ్రాహ్మణ మహాసభ సారథ్యంలో బ్రాహ్మణ మహాసభ సభ్యులు ఆర్.వెంకట్రామన్ దాతృత్వంతో నెల్లూరురూరల్ చింతారెడ్డిపాళెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడి పాఠశాలల విద్యార్థులు 146మందికి భోజన పళ్ళాలు, గ్లాసులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో దాత ఆర్.వెంకట్రామన్, ప్రధానోపాధ్యాయిని జ్యోతిర్మయి, బ్రాహ్మణ మహాసభ ప్రతినిధులు రాళ్ళపల్లి రామసుబ్బారావు, డా॥ సర్వేపల్లి అజయ్‌కుమార్, యనమండ్ర నాగదేవిప్రసాద్, ఎస్ఎల్‌వి ప్రసాద్, కనుపర్తి శ్రీనివాసమూర్తి, దక్షిణ సింహపురి బ్రాహ్మణ సంఘ కార్యదర్శి ఆర్‌వియస్ ప్రసాద్, నంద కిషోర్, ఉపాధ్యాయులు కనుపర్తి పద్మావతి పాల్గొన్నారు.

## అకడమిక్ అబ్జర్వర్‌గా విద్వాన్ కిరణశ్రీ



నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త, ప్రభుత్వ పాఠ్యగ్రంథ రచయిత విద్వాన్ కిరణశ్రీని ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో గల బిసి గురుకుల పాఠశాలలపై అకడమిక్ అబ్జర్వర్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. కిరణశ్రీ 34సంవత్సరాలు నెల్లూరు సిఏఎం ఉన్నత పాఠశాలలో పనిచేసి 2007 జూన్‌లో ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠ్యగ్రంథ సిలబస్ కమిటి సభ్యునిగా 7వ తరగతి నుండి ఇంటర్ వరకు ప్రభుత్వ తెలుగు పాఠ్యగ్రంథ రచయితగా పనిచేశారు. 1995లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రపతి బహుమతి అందుకున్నారు. 2010లో రాష్ట్రీయ శిక్షాసమ్మాన్ స్పీకర్ అవార్డ్ న్యూఢిల్లీలో, 2000లో యునెస్కో అవార్డు బెంగుళూరులో, 2015లో ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశిష్ట ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. గత 4సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ అధికార అనువాదకునిగా పని చేస్తూ ఇప్పటికి 80పుస్తకాలు ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువదించారు.

# చిందులేస్తే నింద పోతుందా?



*మంత్రయ్యాడనే గాని జిల్లాకు నారాయణ రూపాయి పని చేయడం లేదు. ఇది జనాభిప్రాయం. దీనిని పక్కనపెట్టి నేను పని చేస్తున్నాని చెప్పుకోవడానికి ఆయన అధికారుల మీద చిందులేస్తే ఏం లాభం? ఇద్దరు అధికారులను చెడామడా తిట్టగానే మంత్రి గారు బ్రహ్మాండంగా పని చేస్తున్నారనుకోవాలా?*

గత నెలలో నెల్లూరులో వరదలు సంభవించడం తెలిసిందే! నెల్లూరులో భారీ వర్షాలు పడతాయని, నగరం ముంపుకు గురవుతుందని ఎవరూ వూహించలేదు. ఊహించనిది అనూహ్యంగా జరిగిపోయింది. ఇంతవరకు బాగానే వుంది. ఆ తర్వాత వరద సహాయక చర్యలలో పాలనాయంత్రాంగంతో పాటు అధికార యంత్రాంగమంతా చురుకుగా పాల్గొంది. ఇక నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి, ఎస్ఇ ఇమాముద్దీన్‌లు రేయింబవళ్లు కష్టపడ్డారు. అయితే నగరంలో వున్న సమస్యలన్నింటినీ ఒక్కరోజులో మాయం చేయడానికి వాళ్ల దగ్గరేం మంత్రదండాలు లేవు కదా! పిండి కొద్ది రొట్టె అంటారు. ఉన్న కొద్దిపాటి సిబ్బంది, వనరులతో పనులు చేయిస్తూనే వున్నారు. మన మంత్రి గారికి మాత్రం ఆలోచించిందే తడవుగా పని జరిగిపోవాలి. ఆయనకు ఆ విధంగా జరుగుతూ పోబట్టే 30ఏళ్లలోనే ట్యూటర్ స్థాయి నుండి మినిస్టర్ స్థాయికి వెళ్లగలిగాడు. అందరి రాతలు అలా వుండవు కదా! చకచకా పనులు చేయడానికి వాళ్లేం రోబోలు కాదు కదా! వాళ్ల స్థాయిలో కష్టపడుతూనే వున్నారు. అయినా ఈమధ్య మంత్రి నారాయణ ఎందుకో వాళ్లిద్దరి మీద విరుచుకుపడ్డాడు. పని చేస్తున్నారా? నిద్రపోతున్నారా? మీకు చేతకావడం లేదంటూ తన ప్రతాపమంతా చూపించాడు. గురివింద గింజ తన నలుపెరుగదు అనే సామెతను ఇక్కడ మంత్రి గుర్తు చేసారు. ఒకటిన్నర ఏడాదిలో ఆయన నెల్లూరు జిల్లాకు నయాపైసా పని చేయలేదు. ఒక రోడ్డు వేయలేదు, ఒక సైడు కాలువ తవ్వించలేదు. మున్సిపల్ మంత్రిగా వుండి కూడా నెల్లూరు నగరంలో మనుషులకంటే పందులు ఎక్కువగా తిరుగుతుంటే వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. తన లోపాలను కప్పి పుచ్చుకోవడానికి అధికారులపై ఆగిత్తం చేయడంలో ఔచిత్యమేంటో!

# అంతర్జాతీయ క్రికెట్‌కు నెల్లూరు క్రీడాకారిణి



నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెవిఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న సింధూజ త్వరలో ఆస్ట్రేలియాలో జరగనున్న అంతర్జాతీయ మహిళా క్రికెట్ టోర్నమెంటుకు వెళ్ళనుంది. స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఇటీవల జమ్ము-కాశ్మీర్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ఆంధ్రా క్రికెట్ జట్టులో అత్యంత ప్రతిభ కనపరచిన సింధూజ అంతర్జాతీయ క్రికెట్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా సోమవారం నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జిల్లా అదనపు జాయింట్‌కలెక్టర్ రాజ్‌కుమార్, శాప్ డైరెక్టర్ రవీంద్రబాబు, క్రీడా ప్రాధికార సంస్థ అధికారి యతిరాజ్, పలువురు క్రీడా సంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయుడు రవిప్రకాశరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు అజయ్‌కుమార్, సింధూజా తల్లిదండ్రులు జీవరత్నమ్మ, గుణశేఖర్ పాల్గొన్నారు.

### సింధూజకు కోటంరెడ్డి ప్రోత్సాహం

అంతర్జాతీయ క్రికెట్ టోర్నీకి ఎంపికైన గుణశేఖర సింధూజను దత్తత తీసుకుని ఆమెను అంతర్జాతీయ క్రీడాకారిణిగా తీర్చిదిద్దేందుకు నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముందుకొచ్చారు. 8వ తేదీ భక్తవత్సలనగర్‌లోని కెవిఆర్ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో జరిగిన సింధూజ అభినందన సభకు ఆయన హాజరై క్రీడాపరంగా సింధూజకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని హామీ ఇచ్చారు. నవంబర్ 28 నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు జమ్మూలో జరిగిన జాతీయ స్కూల్‌గేమ్స్ అండర్-17 బాలికల క్రికెట్ టోర్నీలో ఆల్‌రౌండ్ ప్రతిభ చూపి అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన సింధూజను నెల్లూరు జిల్లా క్రీడా కీర్తికిరీటంగా ఆయన అభివర్ణించారు. సింధూజ తల్లిదండ్రులు గుణశేఖర్, జీవరత్నం, పిఇటి అజయ్‌కుమార్‌లను కూడా ఆయన అభినందించారు. అలాగే వివిధ ఆటలలో రాణిస్తున్న ఈ పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్ సింధూజకు 5వేల నగదు బహుమతి అందజేశారు.

# భారీ నష్టాన్ని అడ్డుకుంది బాబే

**- లైన్‌లో పడ్డ ఆనం రంగమయూర్‌రెడ్డి**



వరద ప్రాంతాలు మరింత ముంపుకు గురికాకుండా యుద్ధ ప్రాతిపదికన ఒక్క రోజు ఉండాల్సిన సిఎం మూడు రోజుల పాటు నెల్లూరులో వుండి సమీక్షా సమావేశాలు నిర్వహించి అధికారులకు దశా దిశ నిర్దేశించి నెల్లూరుకు భారీ నష్టం రాకుండా అడ్డుకున్న ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 12వ డివిజన్‌లోని వరద ముంపు ప్రాంతమైన వావిలేటిపాడులోని ముస్లింపాళెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేషన్ సరిగ్గా నిర్వహించాలని, నీట మునిగిన ప్రాంతాల్లో నిలిచిన నీరు కృష్ణపట్నం కాలువకు మళ్ళించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

మయూర్ ఘటికుడే! అక్కడ తండ్రి, చిన్నాన పార్టీ మారారో లేదో ఇక్కడ అట్టే తన ప్రసంగం స్టైల్‌ను కూడా మార్చి తండ్రికి తీసిపోనని నిరూపించుకున్నాడు.

# సేవలకు ప్రతీకలు హోంగార్డులు

**- ఎస్పీ ప్రశంసలు**



పోలీసు వ్యవస్థలో హోంగార్డులు కష్టపడి పని చేస్తున్నారని, వారి సేవలు ప్రశంసనీయమని నెల్లూరుజిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్ కొనియాడారు. హోంగార్డుల 53వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 796మంది హోంగార్డులు శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, మెరైన్, పోలీసు అంతర్గత భద్రత, డిప్యుటేషన్ వంటి విభాగాల్లో పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. గోదావరి పుష్కరాలు, అమరావతి శంకుస్థాపన, తిరుమల బ్రహ్మోత్సవాలు, రొట్టెల పండుగ వంటి పలు బందోబస్తులలో క్రమశిక్షణతో పని చేశారన్నారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, అత్యవసర పరిస్థితులు, ఆర్థిక, సామాజిక, సంక్షేమ కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం వంటివన్నీ హోంగార్డుల విధులని తెలిపారు. చనిపోయిన, పదవీ విరమణ చేసినవారికి ఒకరోజు వేతనాన్ని హోంగార్డులు స్వచ్ఛంధంగా ఇస్తుండడం అభినందనీయమన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి జనతా ప్రమాదబీమా కింద రూ.2.5లక్షలు అందజేస్తామన్నారు. ప్రతిభ కనబరచిన హోంగార్డులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సూరిబాబు, హోంగార్డ్స్, నెల్లూరురూరల్, స్పెషల్ బ్రాంచి ఏఆర్ డిఎస్పీలు శ్రీనివాసరావు, తిరుమలేశ్వర్‌రెడ్డి, కోటారెడ్డి, చెంచిరెడ్డి, హోంగార్డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కెజెయం చిరంజీవి డిటిసి ఆర్‌ఐ లక్ష్మణ్‌కుమార్, ఏఆర్ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో చివరి కార్తీక సోమవారం



పరమేశ్వరునికి అత్యంత ప్రీతిప్రదమైన కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా నెల్లూరులోని అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీ స్వామి అమ్మవార్లకు పాలాభిషేకాలు, నిత్య రుద్రహోమాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు విశేషంగా పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి నోములు నోచుకున్నారు. రాత్రి ప్రాకారోత్సవాన్ని నేత్రపర్వంగా జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ మీనాక్షి సుందరేశ్వరస్వామి దేవస్థానం వద్ద మహిళా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్తీకదీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ కోదండరామిరెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో చివరి కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ మునగా వెంకటేశ్వర్‌రావు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. నెల్లూరు నగరంలోని అన్ని శైవక్షేత్రాల్లో పరమశివునికి విశేషంగా పాలాభిషేకం, రుద్రహోమాలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో కార్యనిర్వహణాధికారులు భక్తుల కొరకు అన్ని ఏర్పాట్లు చేశారు.

# అంతర్జాతీయ యోగా పోటీలకు జోష్ణవి



ఈ నెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ యోగా ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనే భారత జట్టులో స్థానం పొందిన నెల్లూరు మాగుంట లేఅవుట్‌కు చెందిన వై.జోష్ణవిని శాప్ డైరెక్టర్ యం.రవీంద్రబాబు మంగళ వారం నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన అభినందన కార్యక్రమంలో సత్కరించారు. భారతజట్టులో స్థానం పొందిన జోష్ణవి ఈనెల 11 నుంచి 14వరకు హర్యానాలో జరగనున్న భారత జట్టు శిక్షణ శిబిరంలో ప్రత్యేక శిక్షణ పొందనుంది. 2013లో తొలిసారిగా పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ యోగా ఛాంపియన్‌షిప్ పోటీలలో అండర్ 14 విభాగంలో భారత జట్టు తరపున పాల్గొని వ్యక్తిగత విభాగంలో 3 కాంస్య పతకాలను సాధించింది. సౌత్‌కొరియా సియోల్‌లో జరిగిన ఏషియన్ యోగా ఛాంపియన్‌షిప్ పోటీలలో బంగారు పతకాన్ని, 2015లో బ్యాంకాక్‌లో జరిగిన ప్రపంచ యోగ దినోత్సవ పోటీలలో అండర్ 17 విభాగంలో బంగారు పతకం సాధించి భారతదేశ కీర్తి ప్రతిష్టను ప్రపంచ దేశాలలో ఇనుమడింపజేసింది. 4వసారి అంతర్జాతీయ స్థాయి యోగా పోటీలకు వై.జోష్ణవి ఎంపిక కావడం పట్ల రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ అభినందన కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్.కె.యతిరాజ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి పి.రామమూర్తి, జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శి సెల్వం తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## రాష్ట్ర స్థాయి 'ప్రేరణ' సదస్సులో

# శిక్షకులుగా న్యాయవాది మునిరాజా



మునిరాజాను అభినందిస్తున్న రోటరీ అధ్యక్షులు అశోక్ చక్రవర్తి, జానకిరామిరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ ఇచ్చేందుకు గుంటూరులో నిర్వహించిన 'ప్రేరణ' సదస్సులో శిక్షకులుగా గూడూరు న్యాయవాది పసుపులేటి మునిరాజా పాల్గొన్నారు. రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి రావెల కిషోర్‌బాబు సారధ్యంలో అంతర్జాతీయ వ్యక్తిత్వవికాస శిక్షకులు ప్రదీప్ నాయకత్వంలో గుంటూరు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో 'లక్ష్య నిర్దేశం' అనే అంశంపై మునిరాజా ప్రసంగించారు. గతంలో కేంద్ర మానవవనరుల శాఖ, సామాజిక న్యాయశాఖ, ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వ విద్యాలయం, సేవ్ ద చిల్డ్రన్ తదితర సంస్థల ఆధ్వర్యంలో గ్వాలియర్, నాగపూర్, చెన్నై, హైదరాబాద్ వంటి చోట్ల జరిగిన అనేక జాతీయ స్థాయి సదస్సులు, వర్క్‌షాపుల్లో ఆయన పాల్గొన్నారని తెలిపారు. ప్రస్తుతం స్థానిక రోటరీ క్లబ్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మునిరాజా పొందిన ఈ విశిష్ట గౌరవానికి క్లబ్ అధ్యక్షులు ఎస్.వి.అశోక్ చక్రవర్తి, సీనియర్ రొటేరియన్లు కె.మునిగిరీష్, దశరథరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, కె.సుందర రామిరెడ్డి తదితరులు ఆయనను అభినందించారు.

# విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపాలి

విద్యార్థులు క్రీడల్లో మంచి ప్రతిభను చూపి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎంపిడివో భవాని పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 5వ తేదీ రాజీవ్‌గాంధీ ఖేల్ అభియాన్ పోటీలు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడివో భవాని, ఎంఈవో దిలీప్‌కుమార్‌లు మాట్లాడుతూ ఏ రంగంలోనైనా పోటీతత్వం ఉంటే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చన్నారు. క్రీడా, జాతీయ జెండాలను ఎగురవేశారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. బాలబాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, హాకీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందినవారు నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు తదితర మండలాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బి.వి.మనోజ్‌కుమార్, మోహన్‌రాజు, దుర్గాప్రసాద్, సందానిబాషా, విజయ, చంద్రశేఖర్, విజయకుమార్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## డా॥ బిఆర్ అంబేద్కర్ జాతీయ

# ఫెలోషిప్‌నందుకోనున్న పార్వతయ్య



భారతీయ దళిత సాహిత్య అకాడమి ద్వారా డా॥ బి.ఆర్.అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డును మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి అరవ పార్వతయ్య న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందుకుంటున్నట్లు భారతీయ దళిత సాహిత్య అకాడమి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జె.ఎస్.రఘుపతిరావు తెలిపారు. 45సంవత్సరాలుగా అరవ పార్వతయ్య దళిత బహుజనులకు చేసిన సేవలను గుర్తించి సాహిత్య అకాడమీ వారు ఈ అవార్డును ఇస్తున్నట్లు తెలిపారు.

## పిఎస్‌ఆర్ ట్రస్టు, కాంతమ్మ మెమోరియల్ ట్రస్ట్ దాతృత్వంతో

# విద్యార్థులకు విద్యాసామాగ్రి



విద్యార్థులకు బల్లలు బహుకరిస్తున్న దాతలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ఉన్న కాంతయ్య బడికి ఈ నెల 5వ తేదీ పిఎస్‌ఆర్ ట్రస్ట్ మరియు కాంతమ్మ మెమోరియల్ ట్రస్ట్ దాతృత్వంతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు అందజేసిన బల్లలు, విద్యాసామాగ్రిని స్థానిక షాదిమంజిల్‌లో పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాత, పారిశ్రామికవేత్త పొనకా శివకుమార్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనలు మాట్లాడుతూ చదువు ఆవశ్యకత, గొప్పదనాన్ని గుర్తించి పేదరికం నుంచి ఉన్నతస్థాయికి ఎదిగేలా లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలన్నారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట సురేష్, ప్రతినిధులు షేక్ రియాజ్ అహ్మద్, నవీన్ జయకుమార్, కడివేటి చంద్రశేఖర్, రామ్‌మోహన్, మల్లు విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి ఫలాలు అందాలి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో అంబేద్కర్ వర్ధంతిని వివిధ సంఘాల నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివేకానందరోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సేవాసంఘ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో పేర్కొన్నట్లు దళితులకు అభివృద్ధి ఫలాలు సంపూర్ణంగా అందడం లేదని, ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి పట్టకుండా ప్రతిఒక్కరూ కలసి సాధించుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చొరవచూపాలన్నారు. ఈ కార్యక్రమంలో మనపాటి రవీంద్రబాబు, యాదగిరి, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు. కాగా పట్టణంలోని పోస్టల్ కార్యాలయం వద్ద అంబేద్కర్ వర్ధంతిని ఎస్సీ, ఎస్టీ టెలికాం ఎంప్లాయిస్, గడియారం కూడలి ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ ప్రతినిధి నాగిశెట్టి ధర్మయ్య ఆధ్వర్యాన వర్ధంతిని నిర్వహించారు. ఇంకా పలు కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

## - ప్రత్యేకాధికారి రామచంద్రారెడ్డి

గూడూరు పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక ప్రత్యేకాధికారి రామచంద్రారెడ్డి తెలిపారు. పలు వార్డుల్లో పారిశుద్ధ్యంపై ఆయన మున్సిపల్ కమిషనర్ మోద కొండతో కలసి విస్తృతంగా పర్యటించారు. నరసింగరావుపేట, జనార్ధనరెడ్డి కాలనీ, బిసి కాలని, మున్సిపల్ కార్యాలయం, ఇంకా పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పరిస్థితులను పరిశీలించారు. పారిశుద్ధ్యం అధ్వాన్నంగా ఉందని మెరుగుపరచాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అనంతరం పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరదలకు దెబ్బతిన్న ఇళ్ళను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కనుల పండువగా ఏడు గంగమ్మల జాతర





గంగమ్మ సారెను తీసుకెళ్తున్న పాలకమండలి, ఆలయ కార్యనిర్వహణాధికారి తదితరులు

చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి పట్టణంలో ఎక్కడ లేనివిధంగా ఏడు గంగమ్మల జాతర బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు కళాకారులతో గంగమ్మలను పోటీలు పడి గంగమ్మ జాతరను వైభవంగా చేశారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఏడు గంగమ్మలకు సారెను ఆలయం నుంచి ముత్యాలమ్మ గుడివీధిలో ఉన్న గంగమ్మ ఆలయం వరకు మేళ తాళాలతో శ్రీకాళహస్తీశ్వర అటవీ శాఖా మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, వారి సతీమణి బృందమ్మ, పాలకమండలి అధ్యక్షులు గురవయ్యనాయుడు, సభ్యులు బాలాజీ, ప్రమీలమ్మ, కండ్రిగ ఉమ, జయగోపాల్, గుర్రప్పశెట్టి, లోకనాథం నాయుడు తదితరులు, ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ ఊరేగింపుగా తీసుకెళ్ళి గంగమ్మ ఆలయం వద్దకు చేర్చారు. తర్వాత ఆయా గంగమ్మల కమిటీల వారికి అందచేశారు. పెండ్లిమండపంలో గంగమ్మను శివలింగంలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. నందివాహనంలో దర్శనమిచ్చారు. వెనుకభాగాన అమ్మోరుగా ఏర్పాటు చేశారు. 22 అడుగుల ఎత్తుతో 12 అడుగుల వెడల్పుతో సప్పరాన్ని రూపొందించారు. జయరామరావువీధిలో గంగమ్మను సాదా సీదాగా మండపంలో ప్రతిష్ఠించే విధంగా తమిళనాడు జిల్లా ఊతుకోటకు చెందినవారు చేశారు. గాలిగోపురం గంగమ్మకు కేరళ నుంచి ప్రత్యేక నిపుణుల్ని రప్పించి అలంకరణ చేశారు. సింహవాహనంపై అమ్మవారిని ప్రతిష్ఠించి రాక్షసుని చంపే దృశ్యాన్ని రూపకల్పన చేశారు. బుధవారం తెల్లవారుజామున మేళతాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా వచ్చి వారి వారి వీధుల్లో వారు గంగమ్మలను ఊరేగింపుగా తీసుకెళ్ళారు. తిరిగి రాత్రి అంగరంగ వైభవంగా మేళతాళాలతో గంగమ్మలను తీసుకెళ్ళి స్వర్ణముఖి నదిలో కలిపారు.

ఈ ఏడు గంగమ్మ జాతరను చూడడానికి వివిధ జిల్లాల నుంచి, పట్టణాలు, గ్రామాల నుంచి అనేక వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు దుత్తకుండల్లో దీపాన్ని వెలిగించుకొని గంగమ్మల చుట్టూ తిరిగి వారి వారి మొక్కులను తీర్చుకున్నారు. గంగమ్మ జాతర సందర్భంగా భక్తులు గంగమ్మ మాలను సోమవారం నుంచి ధరించారు. బుధవారం రాత్రికి మాలతో మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి గోపాలకృష్ణారెడ్డి దంపతులు ఏడు గంగమ్మలను దర్శించుకున్నారు.

# శ్రీకాళహస్తి న్యూస్

# హమ్మయ్యా వరుణదేవుడు శాంతించాడు



చిత్తూరుజిల్లాలోని తూర్పు ప్రాంతాల్లో ఈశాన్య రుతుపవనాల ద్వారా వర్షాలు కురుస్తాయి. 20 రోజులుగా శ్రీకాళహస్తి పట్టణంలోని సువర్ణముఖినది పొంగడం, పారటం 50 సంవత్సరాల తర్వాత కళకళలాడుతోంది. నెలరోజులపాటు వరుణదేవుడు తన ప్రతాపాన్ని చూపాడు. హమ్మయ్యా వరుణదేవుడు శాంతించాడని జనం ఊపిరి పీల్చుకుంటున్నారు. మళ్ళీ 8వ తేదీ ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రాలు సూచిస్తున్నాయి. నవంబర్ నెలలో వర్షాలు కురవడం ఆనవాయితీ. అయితే ఈ యేడాది సాధారణ సగటు వర్షపాతం 1285 మి.మీలు కాగా రెవెన్యూ రికార్డుల మేరకు నవంబర్ నెలలో వర్షపాతం 958 మి.మీ. నమోదైంది. మూడు రోజులుగా 195మి.మీలు. నమోదైంది. డిశంబర్‌లో సాధారణ సగటు వర్షపాతం 184మి.మీ.లు కాగా మూడు రోజుల్లోనే సాధారణ సగటు కంటే ఎక్కువగా కురిసింది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నష్టపరిహారాలకు సంబంధించి అంచనాల్లో అధికారులు తలమునకలయ్యారు. 617 ఇల్లు కూలాయని, 64 పశువులు చనిపోయాయని, 23 గొర్రెలు చనిపోయాయని శ్రీకాళహస్తి తహశీల్దార్ చంద్రమోహన్ తెలిపారు. 700 హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు.

గల్పిక

# ఏ.సి.సెంటర్‌లో నెహ్రూ, ఇందిర

డిసెంబర్ 2వ తేదీ... విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయం. హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు తన గది వాకిట వద్ద నిల్చొని ఆనం బ్రదర్స్ కోసం ఎదురుచూస్తున్నాడు.

★★★★★

విజయవాడలోని ఓ హోటల్‌లో స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(64+), ఆనం రామనారాయణరెడ్డిలు వున్నారు. అక్కడే ఓ హిప్నాటిస్ట్ కూడా ఉన్నాడు. వీరిద్దరినీ తన కళ్లల్లోకి చూడమని చెపుతూ ఆయన... మీరు గతమంతా మరచిపోతున్నారు, డాక్టర్ వై.యస్. ను పొగిడింది, చంద్రబాబును తిట్టిందంతా మరచిపోతున్నారు. మీ కళ్ల ముందు కేవలం చంద్రబాబునే ఊహించుకోండి, మీకు చంద్రబాబే నాయకుడు, ఎన్టీఆరే దైవం. చంద్రబాబు పరిపాలన అద్భుతంగా వుంది... ఇదొక్కటే మీ మైండ్‌లో ఉంచుకోండి... అని హిప్నటైజ్ చేసాడు. ఆనం సోదరులు దానికి ట్యూన్ అయ్యి సీఎం క్యాంపు కార్యాలయానికి బయలుదేరారు.

★★★★★

సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఆనం సోదరులు కారు దిగారు. పార్టీ ఏ.పి అధ్యక్షుడు కళా వెంకట్రావుతో పాటు నెల్లూరు జిల్లా తెలుగుదేశం నాయకులు, మంత్రి పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, గూటూరు కన్నబాబు, మెట్టుకూరు ధనుంజయరెడ్డి, రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, అబ్దుల్ అజీజ్‌లు వారికి స్వాగతం పలికారు. అందరూ మనసులో మా ఖర్మకొద్దీ మీకు స్వాగతం పలకాల్సి వస్తుందని అనుకున్నారు. చంద్రబాబు ఇద్దరికీ పసుపు కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించాడు. తర్వాత ఇద్దరినీ ఆలింగనం చేసుకున్నాడు. వివేకాను ఆలింగనం చేసుకున్న సమయంలో చంద్రబాబు పైకి... మీరు టీడీపీలోకి రావడం మా అదృష్టం, మీ నాయకత్వంలో నెల్లూరుజిల్లాలో తెలుగుదేశంపార్టీ శక్తివంతం కావాలి, మీ కుటుంబం అంటే నాకు ఎంతో అభిమానం అని చెబుతూ మనసులో మాత్రం నాకు అవసరముండబట్టి మిమ్మల్ని పార్టీలో చేర్చుకోవాల్సి వచ్చింది, మీరు నన్ను తిట్టిన తిట్లకు సిగ్గు శరం వున్నోడైతే అసలు చేర్చుకోకూడదు,, ఏం చేస్తాం, మా ఖర్మ అని అనుకున్నాడు. అదే సమయంలో వివేకా కూడా పైకి... మొన్నటి దాకా మేం కాంగ్రెస్‌లో ఉన్నామనేగాని మా మనసంతా మీ చుట్టూనే వుండేది. మీ నాయకత్వంలో పని చేయాలన్నది మా జీవితాశయం. ఆ కల ఇప్పటికి నెరవేరుతున్నందుకు ఎంతో ఆనందంగా వుందని చెప్పి, మనసులో మాత్రం... మహాతల్లి ఆ సోనియాగాంధీ చేసిన పని ఇది... కాంగ్రెస్‌లో రాజుల్లాగా వున్నాం, నీ దగ్గర గుమస్తాలుగా చేరాల్సి వస్తుంది, నీ నాయకత్వంలో పని చేయాల్సిన దౌర్భాగ్యం వస్తుందనుకోలేదు, మా ఖర్మ ఎలా వ్రాసి పెట్టుంటే అలా జరుగుద్ది కానీ అని అనుకున్నాడు. 'దేశం' తీర్థం స్వీకరణ కార్యక్రమం ముగిసాక ఆనం బ్రదర్స్ నెల్లూరుకు బయలుదేరారు.

★★★★★

ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. కాపువీధిలోని ఆనం వివేకా ఇల్లు. వివేకా పసుపు రంగులో వుండే పులిహోరను తిని తన బెడ్‌రూమ్‌లో నిద్రకు ఉపక్రమించాడు. అయితే ఆయన ఎన్ని ఫీట్లు చేసినా నిద్ర రావడం లేదు. ఏమైందబ్బా అనుకుంటూ... రాజూ అంటూ పిఏను కేకేసాడు. రాజూ లోపలకు వచ్చాడు. పరుపు మీద ఎంత సేపు బొర్లాడినా నిద్ర రావడం లేదు, ఏమైవుంటుందని అడిగాడు. పార్టీ మారారు కదా సార్, అందుకే అయ్యుంటుందని రాజు చెప్పాడు. నీ తెలివి తెల్లారినట్టే వుంది... పరుపు మారిస్తే అలవాటు లేక నిద్ర రాదేమోగాని, పార్టీ మారిస్తే నిద్ర రాకపోవడమేమిటి... అని ఒక్క నిముషం అలా ఆలోచించి... నా గదిలో ఒక్క దోమ కూడా కనిపించడం లేదేంటి... అవి కరుస్తుంటేనే నాకు సమ్మగా నిద్రపడుతుంది, ఎంతయినా వాటి కాటుకు అలవాటు పడ్డ ప్రాణం.. కొంపదీసి ఫాగింగ్ లాంటి పాడుపనులు చేసి ఈ కార్పొరేషన్ వాళ్లు దోమలన్నింటిని చంపేయలేదు కదా అని అడిగాడు. ఫాగింగ్ వంటి పనులు చేయకుండానే మొన్న వరదలకు దోమలన్నీ కొట్టుకు పోయాయని రాజు చెప్పాడు. సరే నువ్వెళ్లు అని రాజును పంపించి వివేకా ముసుగుతన్ని పడుకుని మగత నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

ఏ.సి సెంటర్ ఆఫీసులో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీలు కూర్చుని వున్నారు. వివేకా వేరుశెనక్కాయలు తింటూ అటు వెళ్లాడు. వివేకాను చూడగానే నెహ్రూ... వివేకా జీ... కాంగ్రెస్ నీది... మా తర్వాత ఈ పార్టీని కాపాడాల్సింది నువ్వే... కాంగ్రెస్ అంటే వివేకా, వివేకా అంటే కాంగ్రెస్ అని చెప్పి వాళ్లు మాయమయ్యారు. వివేకా నడుచుకుంటూ నవాబుపేట శివాలయం వద్దకు వెళ్లేసరికి ఆ సెంటర్‌లో టీ బంకు వద్ద రాజీవ్‌గాంధీ, వై.యస్.రాజశేఖరరెడ్డిలు అక్కడ టీ తాగుతున్నారు. వివేకాను చూడగానే రాజీవ్... ఏం వివేకా, నువ్వు కాంగ్రెస్ మనిషివి, కాంగ్రెస్‌ను వదిలి ఎక్కడికీ పోవుగా అని చెప్పగా, పక్కనే వున్న వై.యస్... నువ్వు నేను కాంగ్రెస్‌ను వదిలిపోతామేమోగాని వివేకా మాత్రం అలాంటి పని చెయ్యడు అని చెప్పాడు. రాజీవ్‌తో వివేకా... ఇప్పుడే మీ తాత నెహ్రూ, మీ అమ్మ ఇందిరలు ఏసి సెంటర్‌లో కనిపించి చెప్పారు. డోంట్‌వర్రీ అని చెప్పాడు. ఆ మాటతో రాజీవ్, వై.యస్‌లు మాయమయ్యారు. రాజీవ్, రాజన్న... అంటూ వివేకా కేకలు వేయ సాగాడు. ఆ కేకలకు పై బెడ్‌రూమ్‌లో నిద్రపోతున్న వివేకా కొడుకు ఏ.సి.సుబ్బారెడ్డి మేల్కొని క్రిందకు వచ్చాడు. బెడ్‌రూమ్‌లోకి వెళ్లాడు. రాజీవ్, రాజన్న అని నిద్రలోనే కలువరిస్తున్న తన తండ్రిని తట్టి లేపాడు. కళ్లు తెరచి చూసాక గాని వివేకాకు అర్థం కాలేదు, అప్పటిదాకా తన కొచ్చింది కల అని. అయితే ఆ కలల దెబ్బతో ఆయన ఆ ముందురోజు తెలుగుదేశంపార్టీలో చేరిన సంగతి మరచిపోయాడు. నిద్ర లేవగానే బాత్రూం కార్యక్రమాలు ముగించుకుని బయటకొచ్చాడు. అక్కడ తమ ఇంటికి పసుపు పెయింట్ వేస్తుండడాన్ని చూసి ఆయనకు చిర్రెత్తుకొచ్చింది. రేయ్ ఎవడ్రా ఇంటికి ఈ పెయింట్ వేయమని చెప్పిన సన్నాసి... అని అడగ్గా... అక్కడున్న పెయింటర్... నిన్న మీరే చెప్పారు కదా సార్ అన్నాడు. దానికి వివేకా... నేనెందుకు చెబుతాన్రా, నాకు ఆ కలర్ అంటేనే ఎలర్జీ... శుభ్రంగా కాంగ్రెస్ కలర్‌లు కొట్టండంటూ ఏ.సి సెంటర్‌లో ఆఫీసు వద్దకు పోయాడు. అక్కడ విలేకరుల సమావేశం... వివేకా కూర్చున్నాడు. మీడియా వాళ్లంతా బ్రేకింగ్ న్యూస్ ఇవ్వడానికి రెడీగా ఉన్నారు. వివేకా మొదలుపెట్టాడు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఎవరూ నాశనం చేయలేరు. చంద్రబాబు కాదు వాళ్ల బాబు... ఆయన బాబు వచ్చినా కాంగ్రెస్‌కు ఏమీ కాదు, ఇదో వటవృక్షం. రాష్ట్ర విభజనలో అసలు దోషి, ద్రోహి చంద్రబాబు. ఆయన నాలుకను వేయి ముక్కలుగా కోసినా పాపం లేదు. ఇంత అవినీతికర, దుర్మార్గపు ముఖ్యమంత్రిని నేనెక్కడా చూడలేదు... అని తిడుతూ అక్కడ టేబుల్‌పైన వున్న 'ఈనాడు' పత్రిక చూసాడు. 'దేశంలో చేరిన ఆనం సోదరులు' అనే హెడ్డింగ్‌తో ఫోటోతో సహా వార్త వుంది. వివేకా మైండ్‌లో ముందురోజు జరిగిందంతా సినిమా రీల్‌లా తిరిగింది. రాత్రి వచ్చిన కలల దెబ్బకు తాను ఇంకా కాంగ్రెస్‌లోనే వున్నానన్న భ్రమలో ఉండిపోయానని అప్పటికి గుర్తించాడు. తానిప్పుడు తెలుగుదేశంలో ఉన్నానన్న విషయం గుర్తుకు రావడంతో వెంటనే మాట మార్చి... ఇలా నేను చంద్రబాబును తిడుతుంటే మీరు ప్రసారం చేయాలని వచ్చారా, అంత పాపపు పని నేను చేయనండి, ఈ దేశంలో గాంధీని, గౌతమబుద్ధుడిని, అంబేద్కర్‌ను ఎవరైనా వేలెత్తి చూపగలరా, చంద్రబాబూ అంతే, ఓ గొప్ప నాయకుడు. ఆయన నాయకత్వంలో పని చేయడం మా పూర్వజన్మ సుకృతం(మనసులో మాత్రం గతజన్మ పాపం) అంటూ లేచాడు. విలేకరులంతా అట్లాగే నోరెళ్లబెట్టారు.

---

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

హోల్‌సేల్ వ్యాపారులకు, చిల్లర వ్యాపారులకు అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఉపాధి పథకాలు, వృత్తులు చేసికొనే వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఇంటా బయట వ్యవహారాలలో సరైన నిర్ణయాలు తీసి కొంటారు. ముఖ్య అవసరాలకు, పనులకు ఇతరులు సహాయ పడతారు. ఆస్తి క్రయవిక్రయాలలో జాగ్రత్త.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రభుత్వ పరంగా అనుమతులు, పనులు అనుకూలం కాగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. సామాజిక సంస్థల నిర్వహణ, బాధ్యతలు చేపడతారు. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. వ్యవహారాలలోని ఇబ్బందులను ఇంట బయట సమర్థవంతంగా ఎదుర్కొంటారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి.

### మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఖర్చులు పెరుగుతాయి. కాని ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుంటాయి. రావలసిన బాకీలు, అదనపు ఆదాయాలుంటాయి. ఇతరుల వ్యవహారాలను పైన వేసికొనవద్దు. ఉద్యోగులకు అనుకూల స్థితి వుంటుంది. శుభకార్యములు నిర్ణయం కాగలవు. ఆరోగ్యం బాగుంటుంది. ఉద్యోగార్ధులకు అవకాశాలు లభించగలవు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. వ్యాపారవృద్ధి అవకాశాలు పల్చబడగలవు. విలువైన వస్తువులు, గృహోపకరణలు సమకూర్చుకొంటారు. గృహ నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు చేసేవారికి పనులు ఆలస్యం కాగలవు. వృత్తి ఉపాధి పథకాల వారు స్థిరపడతారు. ఇంట బయట పెండింగ్‌లోగల సమస్యలను జాగ్రత్తగా సర్దుబాటు చేసికొనాలి. ఆరోగ్యం బాగుంటుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనుకున్న పనులు చురుకుగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వివాదాల నుండి బయటపడతారు. వివాహ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. కళా క్రీడా సాంకేతిక రంగాల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అందరిని అతిగా నమ్మకండి. కొత్త కాంట్రాక్టులు లభించగలవు. ఆరోగ్యం బాగుంటుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలలో స్థిరపడతారు. మంచి వ్యాపారావకాశాలుండి ఆదాయం తృప్తికరంగా వుంటుంది. బంధువర్గంతో సంబంధాలు బలపడగలవు. శుభకార్య ప్రయత్నాలు ఫలించి నిర్ణయం కాగలవు. స్థిరాస్తుల వ్యవహారాలు వాయిదా వేసికొనండి. బిడ్డల విద్యా ఆరోగ్య విషయాలందు దృష్టి పెట్టండి. ఆటం కాలను అధిగమించి ఆర్థికంగా స్థిరపడతారు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 11.12.2015 నుండి
తేది. 17.12.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, సింహంలో గురువు, కన్యలో కుజ రాహువులు, తులలో శుక్రుడు, వృశ్చికంలో రవి శనులు, 16 రాత్రి నుండి ధనుస్సులో రవి, ధనుస్సులో బుధుడు, వృశ్చిక ధనుర్మకర కుంభరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

17 తేది గురువారము నుండి ధనుర్మాసారంభం. పండగ నెల ప్రారంభం. శూన్యమాసం కాదు.

**ముహూర్తము**

17 తేది గురువారము రాత్రి గంట 10.0 నుండి గంట 12.0లోగా సింహ లగ్నమున వివాహ, గృహప్రవేశములు.

**మార్గశీర్ష మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 11 | శుక్ర | కార్తీక అమావాస్య | ప॥ గం.3.40వ॥ |
| తేది. 12 | శని | మార్గశీర్ష శుక్ల పాడ్యమి | సా॥ గం.4.0వ॥ |
| తేది. 13 | ఆది | విదియ | సా॥ గం.3.55వ॥ |
| తేది. 14 | సోమ | తదియ | సా॥ గం.3.16వ॥ |
| తేది. 15 | మంగళ | చతుర్థి | ప॥ గం.2.15వ॥ |
| తేది. 16 | బుధ | పంచమి | మ॥ గం.12.48వ॥ |
| తేది. 17 | గురు | షష్ఠి | ఉ॥ గం.10.57వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సొంత నిర్ణయాలు తీసుకొంటూ వచ్చిన ఆర్థిక, సామాజిక అవకాశాలను ఉపయోగించుకొనడం మంచిది. కుటుంబంలో కొద్ది అనుకూలత తక్కువగా ఉంటుంది. కుటుంబ అవసరాలకు ఖర్చులు పెరగడం ఉంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతుంటాయి. చేబదుళ్లు, హామీలు ఇవ్వకండి. ఉద్యోగ పరంగాను, ఆస్తి పరంగాను ఉన్న సమస్యలు సర్దుకుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

పనులు సమర్థవంతంగా నిర్వహిస్తారు. వ్యవహారంలో చిన్నచిన్న సమస్యలున్నా సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి, ఆదాయం తృప్తికరం. బంధుమిత్రులతో సఖ్యత బాగుంటుంది. అనవసర విషయాలలో చొరవ చూపవద్దు. ఉద్యోగులకు పని భారం పెరగడం, స్థానమార్పులు, పైఅధికారుల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. షేర్లు నిరుత్సాహపరుస్తాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబంలో అనుకూలత తక్కువ మరియు భిన్నాభిప్రాయాలుంటాయి. సర్దుకొని పోవడం మంచిది. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు దొరికి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. వృత్తి ఉపాధి రంగాల వారికి అనుకూలత బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. అధికారులు ప్రలోభాలకు దూరంగా ఉండండి, స్థానమార్పులుండ వచ్చును.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు పల్చబడతాయి. అవకాశాలు తగ్గి ఆదాయం తగ్గుతుంది. అధికారులకు స్థానమార్పులు, ఉద్యోగులకు పనిభారం, వత్తిడి పెరుగుతుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు పెండింగ్‌లో పడతాయి. పిల్లల విద్యా వివాహ విషయాలందు శ్రద్ధ చూపుతారు. పెట్టుబడి అవకాశాలు బాగుండినా, పనులు నిదానంగా జరుగుతాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వాహనాలు నడిపేవారు, యంత్రాలు, కరెంటుతో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి. వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వ్యాపార వర్గాలకు అభివృద్ధి, ఆదాయం బాగుంటుంది. ఉద్యోగులకు పని భారం ఉండినా, గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. స్థిరాస్తుల వ్యవహారాలను వాయిదా వేసికొనండి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి


అధికారులకు స్థానమార్పు, ఉద్యోగ ప్రయత్నాలు చేసే వారికి అనుకూలత బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. కుటుంబ ఖర్చులు పెరుగుతాయి. మీ ఆరోగ్యం, బిడ్డల ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపుతారు. రావలసిన బాకీలు కొంతవరకు లభిస్తాయి. కళా క్రీడా సాంకేతిక రంగాల వారికి మంచి అవకాశాలు దొరుకుతాయి.

# కళ్యాణ వైభవం...!

## లషిత - దీపక్



సూపరింటెండెంట్‌గా వైద్యశాఖలో పనిచేసి దివంగతులైన వల్లూరు రామిరెడ్డి మనుమరాలు, శక్తి ఆగ్రో రవీగా అందరికీ పరిచితుడైన వల్లూరు రవీంద్రరెడ్డి - కామాక్షమ్మల కుమార్తె **లషిత - దీపక్**ల కల్యాణం డిసెంబర్ 5వ తేదీ చెన్నైలోని లీలా ప్యాలెస్ హోటల్‌లో ఘనంగా జరిగింది.
"నెల్‌క్యాస్ట్ రాధయ్య"గా ఆ సంస్థ వ్యవస్థాపకుడిగా జగమెరిగిన పొన్నవోలు రాధాకృష్ణారెడ్డి - రాధికల కుమారుడు దీపక్. ప్రస్తుతం నెల్‌క్యాస్ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. రెండు కుటుంబాల వారూ నెల్లూరుజిల్లా వాసులైనా ప్రస్తుతం చెన్నైలో స్థిరపడ్డారు. దీపక్-లషితలకు 'లాయర్' శుభదీవెనలు.



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సోదరుడు మెట్టుకూరు విజయభాస్కర్‌రెడ్డి - పద్మలతల కుమార్తె **దివ్యశ్రీ - ప్రసాద్‌రెడ్డి** (అల్లంపాటి సుబ్బారెడ్డి - నవనీతమ్మల కుమారుడు)ల వివాహం ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.



కోటకు చెందిన ప్రముఖ న్యాయవాది పెల్లేటి గోపాల్‌రెడ్డి - ప్రమీల దేవిల కుమారుడు **రాకేష్‌కుమార్‌రెడ్డి - భవ్యారెడ్డి** (ముత్తుకూరు మండలం ఈపూరు వెంకన్నపాలెం వాస్తవ్యులు పేర్నాటి జితేంద్రరెడ్డి - అనితల కుమార్తె)ల పెళ్ళి నవంబర్ 26వ తేదీ నెల్లూరులోని జిపిఆర్ గ్రాండ్ కల్యాణ మండపంలో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



నెల్లూరులోని రాధిక మెడికల్స్ అధినేత పద్మనాభుని రాజేంద్రప్రసాద్ - హేమమాలినిల కుమార్తె **వెంకటరాధిక - జ్వాలా సందీప్** (గూడూరు వాస్తవ్యులు పొట్టి జ్వాలాప్రసాద్ - భవానిల కుమారుడు)ల పరిణయం ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

## ● నీరు - చెట్టు పనుల వల్లనే చెరువులకు జలకళ

**- రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద**






రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను తెలుగు దేశం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అర్ధమయ్యేలా వివరించాలని రాష్ట్ర రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు, మాజీ శాసన సభ్యులు బీద మస్తాన్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని 13వ వార్డులో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పి.అలేఖ్య అధ్యక్షతన జనచైతన్య యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నీరు - చెట్టు' కార్యక్రమంపై ప్రతిపక్ష నాయకుల విమర్శలు అర్ధరహితమన్నారు. ఈ కార్యక్రమం టీడీపీ నాయకులు పొట్టలు నింపుకోవడానికని విమర్శించడం అవివేకమన్నారు. అప్పుడు పనులు చేయబట్టే నేడు చెరువులు నిండి రెండు పంటలు పండేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తెలుగుదేశంపార్టీకి ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా ముఖ్యమేనన్నారు. దేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన 'నీరు-చెట్టు' పథకాన్ని ఆదర్శంగా తీసుకుంటుంటే మీకు దాని విలువ తెలియకపోవడం అవివేకమన్నారు. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న బాధితులకు బాసటగా నిలిచేందుకే ముఖ్యమంత్రి జనచైతన్య యాత్ర ప్రారంభించారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడూరు ఎరేషన్‌బాబు మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓడినా ప్రజల సంక్షేమాన్ని మరువని గొప్ప వ్యక్తి బీద మస్తాన్‌రావు అని కొనియాడారు. కార్యకర్తల సంక్షేమానికి నారా లోకేష్ బీమా పథకాన్ని ఏర్పాటు చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలలో సగానికిపైగా ఇప్పటికే పూర్తి చేశారని, అన్ని హామీలు తప్పక నెరవేరుస్తారని అన్నారు. ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షులు మల్లిశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ ఛైర్మెన్ శ్రీనివాస కిరణ్, ప్రధాన కార్యదర్శి అమరా యాదగిరిగుప్తా, నాయకులు ఆత్మకూరి బ్రహ్మయ్య, నాగరాజు, తిరివీధి ప్రసాద్, బొంతా శ్రీనివాసులు, జి.వేణుగోపాల్, శ్రీకాంత్, అశోక్, జి.కిషోర్, కృష్ణ, ఎస్.నారాయణ, గోవిందరెడ్డి, కీర్మాణి, బి.శివకుమార్, వల్లెపు కిషోర్ పాల్గొన్నారు.

# కుళాయిల్లో మురికినీరు

## మునిసిపాలిటీ తీరుపై భాజపా ధ్వజం

కావలి పట్టణంలో స్థానిక 9వ వార్డులో గత 15రోజుల నుండి మున్సిపాలిటి కుళాయిల్లో మురికినీరు వస్తుందని స్థానిక వార్డు ప్రజలు మున్సిపాలిటీ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినప్పటికీ వారి నుండి సరైన స్పందన కరువైందని, ఇప్పటికీ వార్డు ప్రజలు మురికినీటినే కుళాయిల నుండి పట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని కావలి నియోజకవర్గ భాజపా అసెంబ్లీ కన్వీనర్, సి.వి.సి.సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు బెల్లం కొండ మాల్యాద్రి, తోట శ్రీహరి, పట్టణ నాయకులు పమిడిమర్రి సంగమేశ్వరరావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మురికినీటిలో చిన్నచిన్న పురుగులు, వైరస్, ఫంగస్ కారణంగా వార్డు ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురువుతున్నారని తెలిపారు. గత రెండు వారాల నుంచి మంచినీరు లేక ప్రజలు బాధపడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 19వ వార్డులో ఈ సమస్యతో అనేకమంది అనారోగ్యానికి గురయ్యారని ఆయన గుర్తు చేశారు. తరచుగా కొళాయిల్లో మురికినీరు రావడం పరిపాటైందన్నారు. కుళాయిల్లో కలుషిత నీరు రాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# కావలిలో జనచైతన్య యాత్ర




ఈ నెల 8వ తేదీన కావలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 7, 8, 9వార్డుల్లో జన చైతన్య యాత్రలు నిర్వహించారు. ఆ వార్డుల పార్టీ అధ్యక్షులు పాపనబోయిన సురేష్, షేక్ ఖమర్‌బాబు, గూడల శ్రీనివాసరావు, కౌన్సిలర్లు పి.రజని, షాకీరా బేగం, బిట్రగుంట శివప్రసాద్‌లు ఈ యాత్రలకు నేతృత్వం వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రామానాయుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ అలేఖ్యలు ముఖ్యఅతిథులుగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పోట్లూరి శ్రీనివాసులు, సర్దార్ కీర్మాణి, ఆత్మకూరు బ్రహ్మయ్య, గుత్తికొండ కిషోర్, మొగల్ మీరాబేగ్, షేక్ పర్వీన్‌జాన్, గాదంశెట్టి వేణుగోపాల్, గంగినేని వెంకటేశ్వరనాయుడు, జ్యోతి బాబూ రావు, మేడికొండ సుకుమార్, చవల రామకృష్ణ, బొట్లగుంట శ్రీహరినాయుడు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు బట్టేపాటి అశోక్‌కుమార్, తెలుగుదేశం పట్టణ నాయకులు దస్తగిరి బాషా, పెనుమల్లి అశోక్, పల్లెపు కిషోర్, మీనాకుమారి, శెట్టిపల్లి మధు, పులిమి భాస్కర్‌రెడ్డి, డా॥ చంద్రశేఖర్, సన్నిబోయిన నారాయణ, అక్కిలిగుంట సూర్యప్రకాష్, జన్మభూమి కమిటీ సభ్యులు, వార్డు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వరద సాయంలోనూ రాజకీయాలా?

## - జడ్పీ సమావేశంలో వైఎస్సార్సీపి ఆగ్రహం



వరద సాయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం, పరిహారం పంపిణీలో రాజకీయాలు చేయడం ఏమిటంటూ వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 5న జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధ్యక్షత్వంలో జడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలు వరద బాధితుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వరదల్లో కష్టాలు పడుతున్నవారిని ఒడ్డుచేర్చడంలో కూడా రాజకీయాలు చేయడం దారుణమన్నారు. బాధితులకు ఇచ్చే నిత్యావసర వస్తువుల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయని, ఈ తతంగమంతా జన్మభూమి కమిటీల కనుసన్నల్లో నడుస్తోందని దుయ్యబట్టారు. టిడిపి నాయకులు కక్కుర్తితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీంతో సమావేశం వాడివేడిగా సాగింది. వాదాలు, వాగ్యుద్ధాలతో రచ్చగా మారింది. వరదల్లో బాధితులకు ఏమి న్యాయం జరిగిందంటూ వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, సునీల్‌కుమార్ మంత్రి నారాయణను నిలదీశారు. ఆత్మకూరులో చెరువులకు మరమ్మత్తులు సరిగా చేయకపోవడం వల్ల అనేక గ్రామాలు నీటమునిగాయంటూ ఎమ్మెల్యే గౌతంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ ఎమ్మెల్యేలకు చెప్పకుండా నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నారని వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలు ప్రోటోకాల్ విషయం ప్రస్తావించడంతో మంత్రి నారాయణ మాట్లాడుతూ, తాను ఆకస్మిక పర్యటన చేస్తున్నా నని, ఆ సమయంలో మీరు లేకపోతే నేనేం చేయాలని ఆగ్రహంతో అన్నారు. అలాంటప్పుడు టిడిపి నాయకులు, కార్యకర్తలకు మాత్రం మీరొచ్చే విషయం ఎలా తెలుస్తోందని వైఎస్సార్సీపి ఎమ్మెల్యేలు అడగడంతో వాగ్వాదం జరిగింది. దీంతో సమావేశం రభసగా మారింది. చివరకి జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వారిని శాంతింపజేసే ప్రయత్నం చేశారు.

# జాతీయ లోక్‌అదాలత్ 12న

జాతీయ న్యాయసేవాధికార సంస్థ పర్యవేక్షణలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ విజయవంతానికి సహకరించాలని నెల్లూరుజిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి కనకదుర్గారావు పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోవూరు, కావలి, ఆత్మకూరు, గూడూరు, కోట, సూళ్లూరుపేట, ఉదయగిరి, వెంకటగిరి న్యాయసేవాధికార సంస్థల్లో లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు, చెల్లని చెక్కులు, ఇన్సూరెన్స్, బ్యాంక్, కుటుంబ తగాదాలు, లేబర్, భూములకు సంబంధించిన, రెవెన్యూ, విద్యుత్, నీటి బిల్లులు, అమ్మకపు పన్నులు, ఆదాయపన్నులు, సర్వీసు కేసులు, అటవీ కేసులు, రైల్వే కేసులు, డిజాస్టర్ కేసులు తదితర వాటిని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. అదనపు జిల్లా జడ్జిలు శ్యామలాదేవి, నరశింహరాజు, పాపిరెడ్డి, రామచంద్రమూర్తి, కిష్టప్ప, మధుసూదన్‌రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సత్యవాణి, పలు కోర్టుల న్యాయమూర్తులు పాల్గొన్నారు.

# తవ్వా రంగయ్య సంతాపసభ

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ పాండురంగ అన్నదాన సమాజంలో ఇటీవల శ్రీ పాండురంగ అన్నదాన సమాజం అధ్యక్షులు తవ్వా రంగయ్య సంతాపసభ అన్నదాన సమాజం ఇన్‌ఛార్జ్ అధ్యక్షులు సోమిశెట్టి రమేష్‌బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తవ్వా రంగయ్య సమాజ అభివృద్ధికి చేసిన సేవలను గురించి పలువురు వక్తలు కొనియాడారు. ఈ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య సంఘ మాజీఅధ్యక్షులు షేగు షణ్ముగం, దొంతంశెట్టి నరసింహారావు, నాగసూరి కామేశ్వరరావు, బి.వి.నరసింహం, మెంటా నరశింహారావు, దాసా లక్ష్మీనారాయణ, అచ్యుత సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య దగ్గుబాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

# గత బలం తిరిగొచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

కేడర్ అంతా కూడా ఆ ఎన్నికలప్పుడే తెలుగుదేశం, వైకాపాలలోకి వెళ్లిపోయింది. నెల్లూరులో అయితే ఏసి సెంటర్ వెలవెలబోయింది. వివేకా వెనుక అరకొర అనుచరులు మిగిలారు. ఇప్పుడున్న బలాన్ని ఆధారం చేసుకుంటే వీళ్ల చేరికవల్ల తెలుగుదేశంకు ఒరిగేదేమీ లేదు. ఆనం సోదరులు తమ పాత అనుచరులను తిరిగి సమీకరించుకోవాలి. కాంగ్రెస్ ఆల్‌రెడీ చచ్చుబడిపోయింది. ఈ పార్టీ నుండి కొత్తగా వచ్చి చేరేదేమీ లేదు. ఇక ఆనం అనుచరుల్లో కొంతమంది గత ఎన్నికలప్పుడే తెలుగుదేశంలో చేరుకున్నారు. వీరు ఎవరి అనుచరులుగా వున్నా పార్టీకి ఒక్కటే! నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాలలో ఆనం అనచరులు పెద్దఎత్తున వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి వలసపోయి వున్నారు. వాళ్లను వీళ్లు తిరిగి తెచ్చుకోగలిగితేనే ఆనం సోదరుల చేరిక వల్ల తెలుగుదేశంకు కొంతన్నా ఉపయోగముంటుంది. పాత అనుచరుల సమీకరణలో ఆనం సోదరులు ఎంతవరకు సక్సెస్ కాగలరో చూడాలి.

# సత్తా చాటిన రూరల్ క్రీడాకారులు

## - ఫుట్‌బాల్, హాకీల్లో ప్రథమ స్థానం

నెల్లూరులోని ఏసి స్టేడియంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన రాజీవ్‌గాంధీ ఖేల్ అభియాన్ క్రీడా పోటీల్లో నెల్లూరు రూరల్‌కు చెందిన క్రీడాకారులు తమ సత్తా చాటారు. బాలుర విభాగంలో సూళ్ళూరుపేట-నెల్లూరు రూరల్ నియోజకవర్గాల జట్లు ఫుట్‌బాల్ పోటీల్లో హోరాహోరీగా తలపడగా, రూరల్ జట్టు విజయం సాధించింది. సూళ్ళూరుపేట, కోవూరు జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. అదేవిధంగా, బాలికల విభాగం హాకీ పోటీల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన బాలికల జట్టు ప్రథమస్థానం సాధించి తమ ప్రతిభను చాటుకుంది. సర్వేపల్లి, వెంకటగిరి జట్లు ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. హాకీ బాలుర విభాగంలోనూ నెల్లూరు రూరల్‌దే విజయం. గూడూరు, సర్వేపల్లి జట్లకు ద్వితీయ, తృతీయ స్థానాలు లభించాయి. ఈ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ ఎం. రవీంద్రబాబు మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారుల్లో మంచి ప్రతిభా నైపుణ్యాలున్నాయని, మంచి శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తే ఆ క్రీడాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించగలరని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడాకారులకు అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని, ఆ అవకాశాలను వినియోగించుకుని క్రీడాకారులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి పసుపులేటి రామ్మూర్తి, వ్యాయామోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు కృష్ణారెడ్డి, సనత్ కుమార్, హాకీ కోచ్ థామస్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటికి అఖండ సాయినామం

ఈ నెల 21న వైకుంఠ ఏకాదశి పర్వదినాన సకల దేవతా స్వరూపుడైన శ్రీ సాయినాథుని అఖండ సాయి నామంతో ఆరాధిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆ రోజున నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద రవీంద్రనగర్ రెండవ వీధిలో వున్న శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తామని మందిరం మేనేజింగ్ ట్రస్టీవారు పేర్కొన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని స్వామివారిని ఉత్తర ద్వారంలోంచి దర్శించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 6.15 నుంచి ఉత్తర ద్వార ప్రవేశం, ఆ తర్వాత ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంల వరకు అఖండ సాయినామం వుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు కీ.శే కలువ వెంకటప్పయ్యగారి జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని కలువ సరోజనమ్మ, కుమార్తె కలువ స్వరూపరాణి ఉభయ కర్తృత్వంలో మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ వుంటుందని, భక్తులందరూ ఈ కార్యక్రమాలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

# వరద బాధితులకు దుప్పట్లు, చాపలు




నెల్లూరు పాత మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో వున్న జయలలిత నగర్ ప్రాంతంలో వరదల్లో దెబ్బతిన్న 130 కుటుంబాల వారికి నెల్లూరు మేత్రాసన సాంఘిక సేవా సంస్థ (డిఎస్ఎస్ఎస్) వారి ఆధ్వర్యంలో బుధవారం క్యాథలిక్ రిలీఫ్ సర్వీసెస(సిఆర్ఎస్) వారి ఆర్థిక సహకారంతో ఒక్కో కుటుంబానికి రెండు దుప్పట్లు, రెండు చాపల వంతున డిఎస్ఎస్ఎస్ డైరెక్టర్ ఫాదర్ జార్జి విలియం సిఆర్ఎస్ ప్రతినిధి రూపాలి, నెల్లూరు మేత్రాసన క్యాథలిక్ పీఠాధిపతి బిషప్ యండి ప్రకాశం పంపిణీ చేశారు. సిస్టర్ కల్పన పుష్ప, కోఆర్డినేటర్ యం.బాలశౌరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చెరువు మింగేసింది

ఇద్దరు చిన్నారులు చెరువు వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మునిగి చనిపోయారు. కోట మండలంలోని చిట్టేడు గ్రామంలో ఈ నెల 5న ఈ దుర్ఘటన జరిగింది. చిట్టేడు ఎస్‌టిటి కాలనీకి చెందిన పద్మశ్రీ(13), మూగ బాలికైన వెంకటరమణమ్మ ఇద్దరూ మద్దాలి కండ్రిగ చెరువు వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతిచెందారు. వెంకటరమణమ్మ తల్లిదండ్రులు చెరువు వద్ద దుస్తులు ఉతుక్కునేందుకు వెళ్లగా, వీరి కుమార్తె అయిన వెంకటరమణమ్మ, స్నేహితురాలైన పద్మశ్రీ ఇద్దరూ చెరువు వద్దకు వెళ్ళారు. కాసేపటికి ఈ బాలికలిద్దరూ కనిపించకపోయేసరికి వెంకటరమణమ్మ తల్లిదండ్రులు స్థానికులకు సమాచారం అందించారు. వెంటనే కొందరు గ్రామస్తులు వచ్చి చెరువులో గాలించి ఆ బాలికల మృతదేహాలను వెలికితీశారు. ఆ చిన్నారుల మృతదేహాలను చూసి గ్రామస్తులు కంట తడిపెట్టారు. ఈ దుర్ఘటనతో ఆ గ్రామం శోకసాగరంలో మునిగిపోయింది.

# జగన్ బలహీనతే... బాబు బలం!

(మొదటి పేజీ తరువాయి)

పటిష్టం చేసుకునే పనిలో వుండగా జగన్ అనుభవ రాహిత్యంతో పార్టీని పటిష్టం చేసుకోలేకపోతున్నాడు.

నాయకులు సందర్భాన్ని సమయాన్ని బట్టి వాగ్దానాలు చేస్తుండాలి. 1992లో ఎన్టీఆర్ సంపూర్ణ మద్యపాన నిషేధం వాగ్దానం చేసాడు. 1994లో అసెంబ్లీ ఎన్నికలొచ్చాయి. ఆ ఎన్నికల్లో ఎన్టీఆర్ చేసిన వాగ్దానం ఉపయోగపడింది. ఆ తర్వాత చంద్రబాబు వచ్చి మద్యంపై నిషేధం ఎత్తేసాడనుకోండి. విజయవాడలో కల్తీ మద్యం ఘటన నేపథ్యంలో బాధితులను పరామర్శించడానికెళ్లిన జగన్ తాము అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తామని వాగ్దానం చేసాడు. ఇది అవసరమా? ఆయన అధికారంలోకి ఎప్పుడు రావాలి? మద్యపాన నిషేధం ఎప్పుడు విధించాలి? ఇంకో మూడున్నరేళ్ల దాకా ఎన్నికలు లేవు. ఒకవేళ జగన్ అధికారంలోకి వచ్చినా ఈ పరిస్థితులలో మద్యపాన నిషేధం జరిగేపనేనా? ప్రజలు కూడా సంపూర్ణ మద్యపాన నిషేధం జరుగుతుందని అత్యాశపడడం లేదు. టీ బంకుల కంటే ఎక్కువవుతున్న మద్యం కొట్లను నియంత్రించాలని కోరుతున్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే బెల్టుషాపులు ఎత్తేస్తామని చెప్పాడు. కాని పర్మిట్ రూంల పేరుతో నయా బెల్టుషాపులు నడిపిస్తున్నాడు. అనధికారికంగానూ అక్కడక్కడా బెల్టుషాపులు నడుస్తున్నాయి. జగన్ వీటి మీద పోరాడాలి. తాను అధికారంలోకి రాగానే రాజధాని కోసం తీసుకున్న భూములను రైతులకు తిరిగిచ్చేస్తానంటున్నాడు. ఇది ఆచరణ సాధ్యమయ్యేపనేనా? జగన్ ఇలాంటి హామీలను ఇవ్వగలిగినప్పుడు... 2014ఎన్నికల సమయంలో అర్హులందరికీ ఋణమాఫీని చేస్తానని ఓ చిన్న హామీ ఇచ్చివుంటే ఈరోజు చంద్రబాబు స్థానంలో ఆయన, ఆయన స్థానంలో చంద్రబాబు ఉండేవాళ్లు. హామీలు ఇవ్వాల్సిన టైంలో ఇవ్వకుండా ఇప్పుడిస్తే ఏం లాభం.

2014ఎన్నికల సమయంలో జగన్ చేసిన మరో పొరపాటు కాంగ్రెస్‌ను వదిలిన కేడర్‌ను దగ్గరకు తీసుకోకపోవడం. ఆయన పరాజయ కారణాలలో ఇది కూడా ఒకటి. పార్టీ గెలుపుకు మొన్నటి బలం సరిపోలేదని ఆయనకు తెలుసు. అన్ని జిల్లాల్లోను కొత్త నాయకత్వాలు, కొత్త బలం సమీకరించాలి. ఈ విషయంలో జగన్ కంటే చంద్రబాబు అడ్వాన్స్ అయ్యాడు. 2014ఎన్నికల్లో తమ పార్టీకి ఏఏ జిల్లాల్లో తక్కువ సీట్లు వచ్చాయో ఆ జిల్లాలపై చంద్రబాబు దృష్టి పెట్టాడు. కొత్త సమీకరణలకు శ్రీకారం చుట్టాడు. అరకొర మిగిలిన కాంగ్రెస్ కేడర్ నంతా కూడా తన పార్టీలోకి లాగేసుకుంటుడగా జగన్ మాత్రం కొత్త సమీకరణల జోలికి పోవడం లేదు. పార్టీలోకి వస్తామంటున్న నాయకులను కూడా వద్దంటున్నట్లుగా వుంది ఆయన వ్యవహారం. కడప, కర్నూలు జిల్లాల్లోనే పలువురు వైకాపా నాయకులు తెలుగుదేశంలో దూరదానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. వీరిని నిలువరించే ప్రయత్నాలు కూడా జగన్ వైపు నుండి లేవు.

జగన్ ముందు తన బలహీనతలు తెలుసుకోవాలి. రాజకీయాల్లో పట్టువిడుపులు ప్రధానం. పార్టీ కోసం, భవిష్యత్‌లో అధికారం కోసం అధికార పార్టీని సమర్థవంతంగా ఎదుర్కోవడం కోసం జగన్ తనను తాను మార్చుకోవాలి.

# వచ్చారు... చూశారు... వెళ్లారు!



జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు వచ్చిన వరదలు జిల్లాను అతలాకుతలం చేశాయి. వరద మీద వరదొచ్చి రైతాంగాన్ని నిలువునా ముంచింది. ప్రజలు ఎన్నడూ లేనివిధంగా ఈ వరద ధాటికి ఎన్నో కష్టాలు పడ్డారు. నష్టాలు కూడా అపారమే. పంటపొలాలు మునిగిపోయి రైతులు, అనేకప్రాంతాల్లో ఇళ్ళలోకి వరద నీరొచ్చి జనం పడ్డ అవస్తలు అన్నిన్ని కావు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఈ భారీవానలు, వరదలకు నానా యాతనలు పడ్డారు. చెరువు కట్టలు తెగిపోయి ఆయకట్టు పొలాలు నీటమునిగితే, వరదల తాకిడికి పండ్ల తోటలు, ఆకు తోటలు సర్వనాశనమయ్యాయి. రొయ్యల చెరువులు వరదల్లో కలసిపోయాయి. చేనేతల మగ్గాలు నీటిలో తేలాయి. ఆరుగాలం కష్టపడి సేద్యం చేసి జీవనం సాగిస్తున్న వేలాది రైతు కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ఇక పేదల దుస్థితి వర్ణనాతీతం. వాగులు వంకలన్నీ పొంగిపొర్లడంతో లోతట్టు ప్రాంతాల పేదప్రజలు పడిన బాధలు మరింత దయనీయం.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు అందించే సాయం కోసం అందరూ ఎదురు చూస్తున్న దశలో కేంద్రబృందం వరద ప్రాంతాల పరిస్థితులను పరిశీలించడానికి రావడంతో అందరూ తమ బాధలు ఆ కమిటీకి విన్నవించుకున్నారు. కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి సత్యేంద్రగార్గె నేతృత్వంలో జాతీయ రహదారి రీజనల్ అధికారి ఏ.కృష్ణప్రసాద్, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మనోజ్ కుమార్ వర్మ, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పరిశోధనా అధికారి వెంకటనారాయణ అంగణి బుధవారం జిల్లాలోని పలుప్రాంతాల్లో హడావిడిగా పర్యటించి బాధితులను పరామర్శించారు. బుధవారం ఉదయం కేంద్రబృందం పెళ్ళకూరు వద్ద రోడ్డుకు పడిన గండిని పరిశీలించింది. జిల్లా కలెక్టర్ ఎం.జానకితో పాటు, ఎంపీ వరప్రసాద్, జిల్లా ఎస్పీ గజరావ్‌భూపాల్, జేసీ ఇంతియాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పి.డి చంద్రమౌళి, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు వీరి వెంట వున్నారు. ఈ సందర్భంగా స్థానికులు వరదల్లో తాము పడిన కష్టాలన్నీ వారికి విన్నవించారు. అక్కడినుంచి కేంద్రబృందం సూళ్ళూరుపేట లోని వట్రపాళెంకు చేరుకుంది. ఆయా ప్రాంతాల నాయకులు, ప్రజలు కేంద్ర బృందాన్ని కలసి అక్కడి పరిస్థితులను వారికి వివరించారు. అక్కడినుంచి కేంద్ర బృందం తడ మండలంలోని కాదలూరు, గొల్లలములువు, ఆ తర్వాత వాకాడు మండలంలోని గంగన్నపాళెం, వాకాడు మీదుగా తూపిలి, బూడిదలవాగు, కొండూరు, అందలమాల, వాలమేడు, జమీన్ కొత్తపాళెం సందర్శించారు. పలు ప్రాంతాల్లో రోడ్లకు పడిన గండ్లను, దెబ్బతిన్న పంటపొలాలను చూశారు. వరద ధాటికి పొలాల్లో ఇసుకమేట వేసి వుండడాన్ని గమనించారు. అదేవిధంగా, కోట మండలంలోని పుచ్చలపల్లి, చిల్లకూరు మండలంలోని తిప్పగుంటపాళెం సందర్శించారు. గూడూరులో చెరువు గండ్లను పరిశీలించారు. బాధితులను ఓదార్చారు. తగు సాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అప్పటికే చీకటిపడడంతో సైదాపురం మండలంలోని తురిమెర్ల, కలిచేడుల్లో దెబ్బతిన్న నిమ్మతోటలను లైట్ల వెలుగులో పరిశీలించారు. అనంతరం నెల్లూరుకు వచ్చి జడ్పీ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరించారు. కేంద్రబృందం పర్యటనను పురస్కరించుకుని పలుచోట్ల బాధితులు తమ బాధలు విన్నవించుకున్నారు. వాకాడు మండలంలోని గంగన్నపాళెం, పుచ్చలపల్లి గ్రామస్తులు తమ గ్రామాల్లోని బాధితులకు పరిహారం సక్రమంగా అందలేదని కేంద్రబృందం దృష్టికి తీసుకువచ్చారు. తిప్పగుంటపాళెంలో రొయ్యరైతులు తమ కష్టాలు విన్నవించుకున్నారు. అందరి బాధలు విన్న కేంద్ర బృందం వారి బాధలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని, తగు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

గురువారం కూడా కేంద్రబృందం నెల్లూరు నగరంలో వరద తాకిడికి బాగా దెబ్బతిన్న మన్సూర్‌నగర్, వెంకటాచలం, మనుబోలు, నెల్లూరు రూరల్, అల్లూరు, బోగోలు, జలదంకి, కొండాపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి బాధితుల కష్టాలు తెలుసుకుంది. మొత్తమ్మీద జిల్లాలో భారీవర్షాలు, వరదలకు అపార నష్టం జరిగిందని కేంద్రబృందం ప్రత్యక్షంగా తెలుసుకుంది. ఏదేమైనా, గతంలోనూ ఇలాంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు కేంద్రబృందాలు రావడం, పరిశీలించడం, వెళ్ళిపోవడం జరిగేదే కానీ, బాధితులకు ఆశించిన రీతిలో సాయం అందిన సందర్భాలు తక్కువే. దీంతో అనేక మంది బాధితులు తమకు సత్వర న్యాయం జరుగుతుందా?.. అనే నిరాశలో వున్నారు. కేంద్రబృందం రానూ వచ్చె.. పోనూ పోయే అనే రీతిలో గతంలో పర్యటనలు జరిగేవి కనుక అనేకమందిలో ఇలాంటి అపోహలే వున్నాయి. ఈ నేపథ్యంలో, ఇప్పుడైనా అలా కాకుండా కేంద్ర బృందం, రైతులు, ప్రజల బాధలను దృష్టిలో పెట్టుకుని, నష్టాలకు కష్టాలకు గురైన బాధితులందరికీ తక్షణ సాయం అందేలా చూడడం కనీస ధర్మం. కష్టాల్లో వున్న ప్రజల పట్ల కేంద్రప్రభుత్వం సానుభూతితో వ్యవహరించి బాధితులను శక్తి మేరా ఆదుకోవాలని, వరద నష్టాల నుంచి కోలుకునేందుకు తగ్గ చేయూతనందించాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు.

## మా జిల్లాను ఆదుకోండి

### - కేంద్ర బృందానికి సోమిరెడ్డి విన్నపం



వరదలతో అన్ని విధాలా నష్టపోయిన నెల్లూరుజిల్లా ప్రజలను ఆదుకోవాలంటూ శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వరద నష్టం పరిశీలనకు వచ్చిన కేంద్రబృందానికి వినతి పత్రం సమర్పించారు. మొన్నటి వరదలకు జిల్లా అతలాకుతలమైంది. వ్యవసాయ, మత్స్యశాఖ, నీటి పారుదల, పంచాయితీరాజ్, ఆర్ అండ్ బి, హౌసింగ్, జాతీయ రహదారుల శాఖలకు సంబంధించి 2255కోట్ల దాకా నష్టం సంభవించింది. ఈ నష్టం, ఈ కష్టం నుండి కోలుకోవాలంటే కేంద్రం సాయం ఎంతో అవసరమని ఆయన ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ వరదలకు సర్వేపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో అలివిగాని నష్టం వచ్చింది. ఒక్క రొయ్యలగుంటలకే 269కోట్ల నష్టం వాటిల్లింది. 3584 హెక్టార్లలో పంట నష్టం సంభవించింది. ముంపుకుగురైన పలు గ్రామాలలో 15రోజులపాటు పడవల్లో వెళ్ళి బాధితులకు ఆహారం, మంచి నీళ్లు అందించాల్సి వచ్చింది. గూడూరు - మనుబోలు మధ్య జాతీయ రహదారిపై 7వంతెనలు కూలిపోయాయి. జాతీయ రహదారికి నాలుగుచోట్ల గండ్లు పడ్డాయి. వరద ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ వంతెనల నిర్మాణం చేపట్టాల్సి వుందని ఆయన పేర్కొన్నారు. అన్ని విధాలుగా నష్టపోయిన నెల్లూరుజిల్లాను కేంద్రం ఉదారంగా ఆదుకోవాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

## భక్తిశ్రద్ధలతో శివమాల దీక్ష



శివమాల ధరించిన స్వాములు నెల్లూరు శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానంలో బుధవారం ఇరుముడి చెల్లించి దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పెన్నానదిలో కార్తీక దీపాలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా గత ఏడాది ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 150మంది శివమాలను ధరించారని, ఈ యేడాది 300మంది భక్తులు శివమాలను ధరించారన్నారు. శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో 7రోజులు 24గంటల పాటు శివనామం స్మరిస్తూ నేడు ఇరుముడి చెల్లించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి, కార్పొరేటర్లు రూప్‌కుమార్‌యాదవ్, ఊటుకూరు మాధవయ్య, దామవరపు రాజశేఖర్, మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సోనియమ్మ జన్మదినం...

## పేదలకు బియ్యం



ఏఐసిసి అధ్యక్షురాలు సోనియాగాంధీ 69వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరురూరల్ బుజబుజ నెల్లూరులో 500మంది పేదలకు బియ్యం బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో లౌకికవాదాన్ని కాపాడుతున్న ఏకైక నాయకురాలిగా సోనియాను అభివర్ణించారు. సమాచారహక్కు చట్టంతో పారదర్శక పాలనకు మార్గమేర్పరచింది ఆమేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శివాచారి, అజీజ్, భాస్కర్, కస్తూరయ్య, ప్రవీణ్‌రెడ్డి, మురళీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com